

సోమవారం 07.09.2026
INK OF TRUTH
# జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
సంపుటి - 34 సంచిక - 138 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో అధికారిక రికార్డులే విజయాలకు నిదర్శనం. వైసీపీ ఐదేళ్ల పాలనలో తీసుకొచ్చిన పరిశ్రమలు, ఆకర్షించిన పెట్టుబడులు, కల్పించిన ప్రైవేట్ ఉద్యోగాలపై ఇప్పటికీ సమాధానం లేదు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



# బలమైన నాయకత్వం.. బలమైన టీడీపీ



## చంద్రబాబు-లోకేశ్ సమక్షంలో లీడర్‌షిప్ కాంక్లేవ్

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ నాయకత్వ నిర్మాణంలో మరో కీలక ముందడుగు వేస్తోంది. రాజకీయాల్లో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ నాయకులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు రెండు రోజుల లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌కు శ్రీకారం చుడుతోంది. ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల్లో నాయకత్వ పటిమను పెంపొందించడంతో పాటు.. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని మరింత సమన్వయంతో పనిచేసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

ఈ నెల 7, 8 తేదీల్లో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో కాంక్లేవ్ జరగనుంది. రెండు రోజుల వ్యవధిలో మొత్తం 10 సెషన్లలో వివిధ అంశాలపై శిక్షణ, చర్చలు, పరస్పర అభిప్రాయాల మార్పిడి ఉండనుంది. సాధారణ సమావేశాల తరహాలో కాకుండా ట్రైనింగ్--ఇంటరాక్టివ్ విధానంలో కాంక్లేవ్ నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ దీనికి అనుగుణంగా కార్యాచరణను రూపొందించారు.

**నాయకత్వంలో నాణ్యత పెంచేలా.. :** పార్టీకి బలమైన కేడర్ ఉన్నప్పటికీ.. మారుతున్న రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నాయకత్వ లక్షణాలను మరింత మెరుగుపర్చాల్సిన అవసరాన్ని టీడీపీ గుర్తించింది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులకు నాయకత్వ నైపుణ్యాలు, రాజకీయ స్పందన, ప్రజలతో అనుసంధానం, కేడర్ సమన్వయం వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

నాయకుడు కేవలం పార్టీ కార్యక్రమాలకు పరిమితం కాకుండా.. తన నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చొరవ చూపేలా తీర్చిదిద్దడమే కాంక్లేవ్ ప్రధాన ఉద్దేశంగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మిగతా 2లో...

**క్షేత్రస్థాయి నాయకత్వ బలోపేతమే లక్ష్యం**

**ప్రజలకు మరింత చేరువగా పార్టీ యంత్రాంగం**

**ప్రభుత్వం-ప్రజలకు వారధిగా నేతలు**

**అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనపై విస్తృత శిక్షణ**

# ఉప్పాడ తీరానికి శాశ్వత రక్షణ

- రక్షణ గోడ డిజైన్, డీపీఆర్‌కు శ్రీకారం
- ఐఐటీ మద్రాస్‌తో అత్యాధునిక సర్వే
- తీర కోత, సముద్ర ప్రవాహాలపై సమగ్ర అధ్యయనం
- అనుమతులు పూర్తిచేసి పనులు ప్రారంభించాలని పవన్ ఆదేశం



**పిఠాపురం(జర్నలిస్ట్ ఫైల్) :** పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ తీర ప్రాంతవాసుల దశాబ్దాల కల సాకారం దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం దిశగా కీలక అడుగులు ప్రారంభమయ్యాయి. రక్షణ గోడ నిర్మాణానికి సాంకేతిక సహకారం అందించేందుకు ఒప్పందం చేసుకున్న ఐఐటీ- మద్రాస్ పనిని ప్రారంభించింది. రూ. 323 కోట్లనేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌తో నిర్మితమవుతున్న ఈ రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఐఐటీ మద్రాస్ ప్రతినిధి బృందం అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో సముద్ర గర్భంలోనూ, తీర ప్రాంతం వెంబడి సర్వే చేపట్టింది.

తీర ప్రాంత ఇంజినీరింగ్, సముద్ర పరిశోధనల్లో విశేష అనుభవం కలిగిన ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందం గత వారం రోజులుగా ఉప్పాడ తీర ప్రాంతంలో క్షేత్రస్థాయి సర్వేలు చేపట్టింది.

మిగతా 2లో...

# నేటి నుంచి కొత్త పింఛన్ల దరఖాస్తులు

- స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో స్వీకరణ
- 26లోగా పరిశీలన, ఆమోద ప్రక్రియ పూర్తి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో పెన్షన్లకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ ప్రారంభం కానుంది.2లో...

# కుప్పకూలిన హాస్టల్ భవనం

- ముగ్గురు మృతి.. శిథిలాల కింద పలువురు
- మరో ఐదుగురి పరిస్థితి విషమం.. 40-50 మంది చిక్కుకుని ఉండొచ్చని అంచనా
- ఘటనపై అమిత్ షా ఆరా.. గోవా పర్యటన రద్దు

మిగతా 2లో...



# ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం నిర్ణయాలు

- ముఖ్యమంత్రి సమావేశంలో డిమాండ్ల పరిష్కారంపై ఏపీ జేఏసీ హర్షం
- 4 లక్షల మంది పెన్షనర్లు, 24 లక్షల ఉద్యోగ కుటుంబాలకు ప్రయోజనం
- ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణతోనే స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం
- హామీలు అమలు కాకపోతే ఉద్యమాలకు సిద్ధం
- సెప్టెంబర్ మూడవ వారంలో ఏపీ జేఏసీ రాష్ట్ర సమావేశం
- ఏపి జేఏసి చైర్మన్ ఎ. విద్యా సాగర్

**విజయవాడ, సెప్టెంబర్ 6(జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ ఫలితంగానే సెప్టెంబర్ 5న రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించి పలు కీలక అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకున్నారని ఈ పరిణామం పట్ల జేఏసీ హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తున్నట్లు జేఏసి చైర్మన్ ఎ. విద్యాసాగర్ సెక్రటరీ జనరల్ కె ఎస్ ఎస్ ప్రసాద్ లు తెలిపారు .

ఉద్యోగ సంఘాలతో శనివారం జరిగిన చర్చలు ముఖ్యమంత్రి యిచ్చిన హామీ ల పరిణామాల పై ఆదివారం ఏపి జేఏసి చైర్మన్ విద్యా సాగర్ కార్యవర్గ సభ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు . సమావేశం లో విద్యాసాగర్ మాట్లాడుతూ ఏపీజేఏసీలోని భాగమైన

మిగతా 2లో...



# 2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్

- డ్రగ్స్ రహిత భారత్‌తోనే వికసిత్ భారత్ కల సాకారం
- మాదకద్రవ్యాల అక్రమ రవాణా నుంచి పునరావాసం వరకు సమగ్ర కార్యాచరణ
- 2029 మార్చి నాటికి 100 నెట్‌వర్క్‌ల ధ్వంసం.. 100 మంది పరారీలో ఉన్న నేరస్థుల రప్పింపు



**పణజీ (జర్నలిస్ట్ ఫైల్)** డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకారమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా మాదకద్రవ్య రహితంగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నక్సలిజాన్ని నిర్మూలించిన తరహాలోనే మాదకద్రవ్యాల ముప్పునూ పూర్తిగా తుడిచిపెడతామని చెప్పారు.

**జాతీయ భద్రతకు అత్యంత కీలకం :** 2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తితో వికసిత్ భారత్‌ను ముందుకు నడిపించాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని షా తెలిపారు. 2014కు ముందు మాదకద్రవ్యాలపై పోరాటం వివిధ విభాగాలు, దర్యాప్తు సంస్థల స్థాయిలో విడివిడిగా సాగేదని పేర్కొన్నారు. అప్పట్లో చిన్నస్థాయి నిందితులను పట్టుకోవడానికే పరిమితమయ్యేవారని చెప్పారు. తమ ప్రభుత్వం డ్రగ్స్‌పై పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత కీలక అంశంగా పరిగణించి సమగ్ర వ్యూహంతో ముందుకు సాగుతోందన్నారు.

**పక్కా వ్యూహంతో నిర్మూలన :** డ్రగ్స్ అక్రమ రవాణా, వాటికి నిధుల సమీకరణ, పంపిణీ, వినియోగం, పునరావాసం వరకు మొత్తం వ్యవస్థను అడ్డుకునేందుకు

మిగతా 2లో...

# పొగాకు రైతులకు భరోసా.. మార్కెట్‌లో మెరుగైన పరిస్థితులు

- రైతులకు గిట్టుబాటు ధరే లక్ష్యంగా నిరంతర పర్యవేక్షణ
- వేలం కేంద్రాలను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు
- నో-బిడ్లను తగ్గిస్తూ కొనుగోళ్లను వేగవంతం చేస్తున్న ప్రభుత్వం
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రత్యేక చర్యలు: అచ్చెన్నాయుడు



**అమరావతి, సెప్టెంబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 ఖీజఎ పొగాకు వేలాల్లో ఇటీవల మార్కెట్ పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు, మార్గదర్శకత్వంతో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. తాను కూడా పొగాకు వేలం ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 4 నాటికి 132 వేలం రోజుల్లో 86.59 మిలియన్ కిలోల ఖీజఎ పొగాకు మార్కెట్ అయిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత సీజన్‌కు అనుమతించబడిన పంట పరిమాణం 142 మిలియన్ కిలోలు కాగా,

మిగతా 5లో...

# చైనాలో భారత జయకేతనం




- చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం చేసుకున్న సాత్విక్-చిరాగ్
- ఫైనల్లో హోరాహోరీ పోరులో చైనా జోడీపై విజయం
- తొలి గేమ్ చేజారినా పట్టువదలని పోరాటం
- ఈ సీజన్‌లో జోడీకి రెండో టైటిల్

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు.

గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన

## ఉప్పాడ తీరానికి శాశ్వత రక్షణ



(మొదటి పేజీ తరువాయి)

అధునాతన డ్రోన్లతోపాటు బీచ్ ప్రొఫైలింగ్, తీర ప్రాంతాల మ్యాపింగ్ కోసం ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్ఎస్ ఆర్టీకే సాంకేతికతను వినియోగిస్తున్నారు. తీర ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సముద్ర అలల ప్రభావం, తీర కోత తీవ్రత, భూభాగ మార్పులు, సముద్ర ప్రవాహాల దిశలు వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. నీటి అడుగు భాగం నుంచి బీచ్ వరకు ఇసుక కణాల సేకరణ, సమగ్ర అధ్యయనం సాగుతోంది. వీటితోపాటు ఉప్పాడ తీర ప్రాంతం వెంబడి ఇసుక, మట్టి అవశేషాల నమూనాలు సేకరించి, శాస్త్రీయ అధ్యయన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. బాతిమెట్రిక్ సర్వే ద్వారా సముద్రపు లోతు, సీ బెడ్ స్థాయిలు, వాటి మార్పులను గుర్తిస్తున్నారు. బీచ్ ఆకృతి, వాలు, ఎత్తుపై అధ్యయనం కొనసాగుతోంది. షోర్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. తీర ప్రాంత కోతను అంచనా వేయడంలో ఈ అధ్యయనం కీలక పాత్ర పోషిస్తుంది.

ఉప్పాడ సముద్ర తీరం వెంబడి ప్రతిపాదిత రక్షణ గోడ నిర్మాణానికి అనువైన అలైన్‌మెంట్‌ను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. భవిష్యత్తులో సముద్ర కోత ప్రభావాన్ని సమర్థవంతంగా, సుదీర్ఘకాలం ఎదుర్కొనే విధంగా డిజైన్ రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. ఈ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐఐటీ మద్రాస్ ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డీపీఆర్ తదితర సాంకేతిక అంశాలపై దృష్టి సారించనుంది.

గత నాలుగు దశాబ్దాలుగా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు సముద్ర కోత సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వందల ఎకరాలు, పలు గ్రామాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. ఎంతో మంది నిర్వాసితులు కాగా, రైతులు వందల ఎకరాల పంట భూములను సైతం కోల్పోయారు. ఈ సమస్య పరిష్కారానికి నడుం బిగించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ , సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు చేపట్టారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రతిపాదన మేరకు సీ ప్రొటెక్షన్ వాల్ , గ్రోయిన్ ఫీల్డ్, హోప్ ఐలాండ్ పరిసరాల్లో ప్రకృతి ఆధారిత తీర రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆమోదం లభించింది. అందుకు అనుగుణంగా డీపీఆర్ రూపకల్పన పనులు ప్రారంభమయ్యాయి. పవన్ కళ్యాణ్ ఈ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పిఠాపురం పర్యటన సందర్భంగా డిజైన్, డీపీఆర్ పై ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందంతో చర్చించనున్నారు. నిర్ణీత గడువు లోపు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా డిజైన్, డీపీఆర్ రూపకల్పన సమాంతరంగా పర్యావరణ, తదితర అనుమతుల ప్రక్రియ పూర్తి చేసి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

## నేటి నుంచి కొత్త పింఛన్ల దరఖాస్తులు

(మొదటి పేజీ తరువాయి)

అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్ పొందని వారికి మరో అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) సిఇఒ వాకాటి కరుణ పింఛన్ల దరఖాస్తుల స్వీకరణకు మార్గదర్శకాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ, అర్హత పరిశీలన, భౌతిక-శాఖాపరమైన ధృవీకరణ, ప్రభుత్వ ఆమోదం వంటి ప్రక్రియలను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయనుని ఆదేశించారు. అర్హులైన వారికి దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కొత్త పింఛన్ల దరఖాస్తుల సేకరణ, పరిశీలన తదితర ప్రక్రియకు షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ధృవీకరణ చేయనున్నారు. 17 నుంచి 21వ తేదీ వరకూ సాధారణ అర్హత పరిశీలన, 22 నుంచి 24వ తేదీ వరకూ భౌతిక, శాఖాపరమైన ధృవీకరణ, అర్హత నిర్ణయం, సిఫారసు చేయనున్నారు. 25 నుంచి 26వ తేదీ వరకూ సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ చేపడతారు. అనంతరం అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. నిర్ణీత నమూనాలోని దరఖాస్తు ఫారాలను ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తును పూర్తి చేసి, అవసరమైన ధృవపత్రాలతో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం వ్యవస్థ ద్వారా రూపొందించిన స్వీకరణ పత్రం అందజేస్తారని పేర్కొన్నారు.

**ఏవరు ఏ ధృవీకరణ పత్రం జారీ చేయాలంటే..** : అన్ని కేటగిరీలకు సాధారణంగా ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధృవపత్రంతో పాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ప్రత్యేక ధృవపత్రాలను సమర్పించాలని సూచించారు. వృద్ధాప్య పింఛన్ కోసం వయస్సు నిర్ధారణకు ఆధార్ నంబరు, వితంతు పింఛన్ కోసం భర్త మరణ ధృవపత్రం, భర్త ఆధార్ నంబరు, ఒంటరి మహిళ పింఛన్ కోసం వివాహిత అయితే కోర్టు/అదాలత్ విడాకుల డిక్రీ; అవివాహిత అయితే తహసీల్దార్ జారీ చేసే అవివాహిత ధృవపత్రం సమర్పించాలన్నారు. దివ్యాంగుల పింఛన్ కోసం 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ బెంచ్‌మార్క్ దివ్యాంగత్వాన్ని నిర్ధారించే సదరం ధృవపత్రం, చేనేత కార్మికుల పింఛన్ కోసం చేనేత, జౌళి శాఖ జారీ చేసిన ధృవపత్రం, మత్స్యకారుల పింఛన్ కోసం మత్స్య శాఖ జారీ చేసిన ధృవపత్రం, డప్పు కళాకారుల పింఛన్ కోసం సాంఘిక సంక్షేమ శాఖ జారీ చేసిన ధృవపత్రం, సంప్రదాయ చెప్పుల తయారీదారుల పింఛన్ కోసం సాంఘిక సంక్షేమ శాఖ జారీ చేసిన ధృవపత్రం, కల్లుగీత కార్మికుల పింఛన్ కోసం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ధృవపత్రం, ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులు జిల్లా వైద్య మండలి జారీ చేసిన ధృవపత్రం సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్ పొందని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## చైనాలో భారత జయకేతనం

(మొదటి పేజీ తరువాయి)

పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు.

నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.

ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.

# బలమైన నాయకత్వం.. బలమైన టీడీపీ

(మొదటి పేజీ తరువాయి)

**ప్రభుత్వం-ప్రజల మధ్య వారధిగా..** : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా పార్టీ నాయకులు కీలక పాత్ర పోషించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకు అందుతున్నాయా? ప్రజల సమస్యలు ఏమిటి? స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి? తదితర అంశాలను నాయకులు నిరంతరం పర్యవేక్షించేలా కార్యాచరణపై చర్చించనున్నారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారం అయ్యే వరకు అనుసరించడం వంటి అంశాలపై నేతలకు మార్గనిర్దేశం చేయనున్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవల్లో పార్టీ నాయకులు సమన్వయకర్తలుగా వ్యవహరించే విధానంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు.

**పనితీరే ప్రాతిపదికగా..** : పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడంతో పాటు.. నాయకుల పనితీరును నిరంతరం అంచనా వేసే విధానాలపై కూడా కాంక్లేవ్‌లో చర్చ జరగనుంది. ప్రతి నాయకుడికి అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడం, సరైన నాయకత్వాన్ని సరైన స్థాయిలో వినియోగించడం, కేడర్‌ను సమన్వయం చేసుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య సమన్వయం పెంచడం ద్వారా పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లే విధానాన్ని



రూపొందించనున్నారు.

**తొలి రోజు.. నాయకత్వంపై దృష్టి** : కాంక్లేవ్ తొలిరోజు ప్రధానంగా నాయకత్వ అభివృద్ధి, నాయకులను తీర్చిదిద్దడం, సరైన స్థానంలో నిలబెట్టడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు.

పార్టీ సంస్థాగత నిర్మాణం, అజెండా రూపకల్పన, పనితీరు మెరుగుదల, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై చర్చ ఉంటుంది. అలాగే స్వర్ణాంధ్ర విజన్, రాజకీయ-ఆర్థిక సాధికారత, సంపూర్ణ సంక్షేమం, ప్రజల సాధికారత అంశాలపై చంద్రబాబు, లోకేశ్ నేతలకు మార్గనిర్దేశం చేయనున్నారు.

**రెండో రోజు.. సుపరిపాలనపై** : రెండో రోజు సుస్థిర అభివృద్ధి, ప్రజా సేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యూనికేషన్ వంటి అంశాలపై శిక్షణ కొనసాగుతుంది. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, స్థానికంగా ప్రజల అవసరాలను గుర్తించడం, వాటికి అనుగుణంగా వ్యవహరించడం వంటి అంశాలను వివరించనున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు, ప్రజలపై ప్రభావం చూపే ఎల్‌నినోపై అవగాహన, దాని ప్రభావాలను ప్రజలకు వివరించే బాధ్యత వంటి అంశాలపైనా నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు.

**స్థానిక ఎన్నికలకు కార్యాచరణ** : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడంపైనా కాంక్లేవ్‌లో చర్చ జరగనుంది. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సమన్వయం చేయడం, కేడర్‌ను క్రియాశీలం చేయడం, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించడం వంటి అంశాలపై కార్యాచరణ రూపొందించనున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి క్షేత్రస్థాయిలో ఉన్న బలాన్ని మరింత పెంచుకునే అవకాశంగా భావిస్తున్న నేపథ్యంలో.. నాయకత్వం నుంచి కేడర్ వరకు సమష్టి కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**అభివృద్ధి-సంక్షేమాన్ని ప్రజల్లోకి..** : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడంలో పార్టీ నాయకుల పాత్రను మరింత పెంచాలని టీడీపీ భావిస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వాస్తవాలతో ప్రజలకు వివరించేలా రాజకీయ కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయనున్నారు.

అదే సమయంలో ప్రతిపక్షాల నుంచి వచ్చే విమర్శలకు వాస్తవాధారాలతో సమాధానం ఇవ్వడం, తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడం, పార్టీ విధానాలను స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపైనా శిక్షణ ఇవ్వనున్నారు.

**చంద్రబాబు-లోకేశ్ ప్రత్యక్ష మార్గనిర్దేశం:** కాంక్లేవ్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హాజరై నేతలకు ప్రత్యక్షంగా మార్గనిర్దేశం చేయనున్నారు. పార్టీ భవిష్యత్ నాయకత్వాన్ని తయారు చేయడం, ప్రస్తుత నాయకుల్లో పనితీరును మెరుగుపరచడం, క్షేత్రస్థాయిలో పార్టీ-ప్రభుత్వ సమన్వయాన్ని పెంచడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. పార్టీకి ఉన్న రాజకీయ బలాన్ని సంస్థాగత సామర్థ్యంగా మలచడం.. నాయకత్వాన్ని మరింత బాధ్యతాయుతంగా తీర్చిదిద్దడం.. ప్రజలతో నిరంతర అనుసంధానాన్ని కొనసాగించడం ఈ కాంక్లేవ్ ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.

# కుప్పకూలిన హాస్టల్ భవనం

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** దేశ రాజధానిలో ఆదివారం ఘోర విషాదం చోటుచేసుకుంది. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సమీపంలోని సత్య నికేతన్‌లో ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ భవనంలో బాలుర పీజీ వసతి గృహం నిర్వహిస్తున్నారు. ఘటనలో ఇప్పటివరకు ముగ్గురు విద్యార్థులు మృతి చెందగా.. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. సుమారు 40 నుంచి 50 మంది వరకు లోపల ఉండి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది.

**మధ్యాహ్నం ఒక్కసారిగా..** : బేస్‌మెంట్‌తో పాటు ఐదు అంతస్తులు ఉన్న ఈ భవనం సుమారు 50 ఏళ్ల నాటిదని పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతులు, నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో ఒక్కసారిగా భవనం కుప్పకూలింది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా బేస్‌మెంట్‌లో నీరు చేరి పునాది బలహీనపడటంతో ప్రమాదం జరిగి ఉండొచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. అయితే దీనిపై అధికారికంగా నిర్ధారణ కాలేదు.

**ముమ్మరంగా సహాయక చర్యలు** : సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్, ఢిల్లీ ఫైర్ సర్వీస్, డీడీఎంఏ బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. అగ్నిమాపక వాహనాలు, క్యాట్స్ అంబులెన్సులను రంగంలోకి దించారు. శిథిలాలను తొలగిస్తూ బాధితుల కోసం గాలింపు చేపట్టారు. ఇప్పటివరకు ఎనిమిది మందిని శిథిలాల నుంచి బయటకు తీసినట్లు పోలీసులు తెలిపారు. వారిలో ఒకరు ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందగా.. మరొకరు చికిత్స పొందుతూ కన్నుమూశారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. సహాయక



చర్యల్లో గాయపడిన ఓ సిబ్బందికి చికిత్స అందించి డిశ్చార్జి చేశారు.

సత్య నికేతన్ ప్రాంతంలో ఇరుకైన వీధుల వెంట పెద్ద సంఖ్యలో పీజీ వసతిగృహాలు, హోటళ్లు, తినుబండారాల దుకాణాలు ఉన్నాయి. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన పలు కళాశాలలు సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో నివసిస్తుంటారు.

కూలిపోయిన భవనంలో సుమారు 15 గదులు ఉన్నాయని, ఒక్కో గదిలో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు ఉండేవారని స్థానిక పోలీసు అధికారి రాజెన్ ఛెత్రి తెలిపారు. కేరళ, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఉండేవారని చెప్పారు. మోతీలాల్ నెహ్రూ కళాశాల, ఆత్మారామ్ సనాతన్ ధర్మ కళాశాల, శ్రీ వెంకటేశ్వర కళాశాలల్లో చదివే విద్యార్థులు ఈ పీజీలో ఉండేవారని తెలిపారు. ఒక్కో బెడ్‌కు నెలకు సుమారు రూ. 12 వేల వరకు అద్దె చెల్లించేవారని పేర్కొన్నారు.

**ఘటనాస్థలికి సీఎం, ఎల్‌జీ** : ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, లెఫ్టినెంట్ గవర్నర్ తారన్‌జీత్ సింగ్ సంధు, పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఎంపీ బాన్సురీ స్వరాజ్ ఘటనాస్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

పక్కనే ఉన్న భవనాన్ని ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించినట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు.

**గోవా పర్యటన రద్దు** : కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, పోలీస్ కమిషనర్, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ డైరెక్టర్ జనరల్‌తో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. ఘటన నేపథ్యంలో తన గోవా పర్యటనను రద్దు చేసుకున్నట్లు సమాచారం.

**యజమాని కోసం గాలింపు** : 'హాస్టల్ డేజ్' పేరుతో ఈ భవనంలో పీజీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భవనం యజమాని గురుగ్రామ్‌లో ఉంటున్నట్లు గుర్తించారు. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. యజమాని ఆచూకీ కోసం ఏడు నుంచి ఎనిమిది ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. భవన నిర్మాణ నాణ్యత, నిర్వహణ, బేస్‌మెంట్‌లో జరుగుతున్న పనులు తదితర అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.

**రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి** : ఈ ఘటనపై కాంగ్రెస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. గాయపడిన వారికి తక్షణ వైద్యం అందేలా చూడాలని కోరారు. బాధితులు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో తగిన హాస్టల్ సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ప్రమాదకర పరిస్థితుల్లో నివసించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రాణం అమూల్యమైనదని.. వారికి భద్రత కల్పించాలని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## 2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం పక్కా ప్రణాళికతో పనిచేస్తోందని అమిత్ షా తెలిపారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదకద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్ (ఏఎన్‌టీఎఫ్)లను ఏర్పాటు చేశామని చెప్పారు. స్థానిక పోలీసు వ్యవస్థలను జాతీయ వ్యూహంతో అనుసంధానించినట్లు వెల్లడించారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)ని పునర్వ్యవస్థీకరించి, సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచామని వివరించారు.

డ్రగ్స్ నియంత్రణను కేవలం నేరాల నిరోధానికే పరిమితం చేయకుండా సామాజిక కార్యక్రమాలతో అనుసంధానిస్తున్నామని షా తెలిపారు. అవగాహన, చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం, జీవనోపాధి అవకాశాలను ఒకే కార్యాచరణలోకి తీసుకొస్తున్నామని చెప్పారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారికి సహాయం అందించేందుకు 1933 మానస్ హెల్ప్‌లైన్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాజకీయ సంకల్పం, కేంద్ర--రాష్ట్రాల సమన్వయంతో 2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీ నాయకత్వంలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం గణనీయంగా తగ్గిందని అమిత్ షా అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత వేర్పాటువాద భావనలు తగ్గాయని తెలిపారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ అభివృద్ధి, ప్రగతి దిశగా ముందుకు సాగుతోందన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్రం అనేక చర్యలు చేపడుతోందని చెప్పారు.

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని వేధించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్ షా అన్నారు. ఒకప్పుడు తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు 'రెడ్ కారిడార్' నిర్మించాలని భావించినవారు ఇప్పుడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లోనూ శాంతి నెలకొందని, 11 వేల మందికి పైగా యువత ఆయుధాలు విడిచిపెట్టారని తెలిపారు. నక్సలిజాన్ని నిర్మూలించిన విధంగానే మాదకద్రవ్యాల ముప్పును కూడా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇతర నేర కార్యకలాపాలకు సంబంధించిన 100 జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను 2029 మార్చి నాటికి ధ్వంసం చేయడం కేంద్రం లక్ష్యమని షా వెల్లడించారు. అదే గడువులో 100 మంది పరారీలో ఉన్న నేరస్థులను దేశానికి తిరిగి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. విదేశాల్లో తలదాచుకున్న నేరస్థులను వెనక్కి రప్పించేందుకు మిషన్ మోడ్‌లో చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

2019 జులై నుంచి 2026 జులై మధ్య 36 దేశాల నుంచి 274 మంది మోస్ట్ వాంటెడ్ నేరస్థులను భారత్‌కు తిరిగి తీసుకొచ్చినట్లు అమిత్ షా వెల్లడించారు. అంతర్జాతీయ సంస్థలు, ఆయా దేశాల ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ పరారీలో ఉన్న నేరస్థులపై చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

# ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం నిర్ణయాలు


(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయ సంఘాలు ముందుగా పి ఆర్ సి వివిధ అంశాలపై మీద ఉద్యమశీ బాట పట్టారని, తర్వాత ఆ బాధ్యత ఏపీ జేఏసీ తీసుకొని ఆగస్టు 26 న చీఫ్ సెక్రటరీకి నోటీసి ఇచ్చి ఉద్యమానికి శ్రీకారం చుట్టామని, తదుపరి జిల్లా కలెక్టర్లకు, ఎమ్మెల్యేలకు ఎంపీలకు రిప్రజెంటేషన్ ఇచ్చే కార్యక్రమం నిర్వహించామని

ఆగస్టు 14 వ తారీఖున ఏపి జే ఏ సి సమావేశమై ఆగస్టు 31 వరకు ప్రభుత్వానికి సమయం ఇస్తూ దానిలోపు ముఖ్యమంత్రి గారు చర్చిలకు పిలవాలని లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణ తప్పదని చెప్పామన్నారు. 5 వ తేదీ లోపు చర్చలకు పిలవని పక్షంలో ఏపీ జేఏసీ ఉద్యమ శంఖారావం పూరించటానికి సెప్టెంబరు 25 సమావేశం నిర్వహించిందని దాని జరిమిలా రాష్ట్రప్రభుత్వం స్పందించి 5 వ తేదీన చర్చలకు పిలవడం సానుకూలంగా పరిష్కారం కావడ ముదావహం అని తెలిపారు.

పీఆర్సీ కమిటీ నియామకం, రెండు డీఏల విడుదల, సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపింది. ముఖ్యంగా సుమారు 4 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం చేకూరే విధంగా తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని తెలిపారు.

హెల్త్ కార్డుల అమలులో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు జేఏసీ తెలిపింది. ఉద్యోగులు చెల్లిస్తున్న కాంట్రిబ్యూషన్‌తో పాటు ప్రభుత్వం చెల్లించాల్సిన వాటాను కూడా ప్రతి నెల 1వ తేదీన ట్రస్ట్ ఖాతాకు పూర్తిగా బదిలీ చేయాలని సూచించగా, ముఖ్యమంత్రి వెంటనే సానుకూలంగా స్పందించి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. ప్రతి నెల రూ. 30 కోట్లకు పైగా నిధులు ట్రస్ట్‌కు క్రమం తప్పకుండా అందితే ఆసుపత్రులకు 2--3 రోజుల్లోనే చెల్లింపులు జరిగే అవకాశం ఉంటుందని, తద్వారా వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని ఈ




నిర్ణయం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబ సభ్యులు కలిపి దాదాపు 24 లక్షల మందికి మెరుగైన వైద్య సేవలు అందే పరిస్థితి ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. హెల్త్ కార్డులకు సంబంధించిన మిగిలిన సమస్యల పరిష్కారం కోసం చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కూడా కోరినట్లు తెలిపారు

అలాగే పీఆర్సీ కమిటీ నియామకంతో పాటు ఇంటరిమ్ రిలీఫ్ ప్రకటించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు జేఏసీ పేర్కొంది. గత పీఆర్సీల చరిత్రను ప్రస్తావిస్తూ, సాధారణంగా పీఆర్సీ కమిటీ నియామకంతో పాటు ఐఆర్ ప్రకటించే ఆనవాయితీ లేదని ముఖ్యమంత్రి పేర్కొన్నప్పటికీ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, తగిన సమయంలో ఐఆర్ అంశాన్ని కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మరిన్ని సంక్షేమ పథకాల పరిధిలోకి తీసుకురావడం, వారికి ప్రయోజనం చేకూరే చర్యలు చేపట్టడం, అలాగే కొన్ని విభాగాల్లో పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచే అంశాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు .

డిమాండ్ల సాధన అనేది నిరంతర ప్రక్రియ అని, ముఖ్యమంత్రి సమావేశంలో ఇచ్చిన హామీలకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడతాయని ఆశిస్తున్నామని జేఏసీ తెలిపింది. అదే సమయంలో హామీలు అమలు కాకపోయినా, లేదా డిమాండ్ల పరిష్కారంలో జాప్యం జరిగినా, ఉద్యమ కార్యాచరణ చేపట్టడంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై తదుపరి కార్యాచరణను నిర్ణయించేందుకు సెప్టెంబర్ మూడవ వారంలో ఏపీ జేఏసీ రాష్ట్ర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

ఏపీజేఏసీ సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూలి ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి ఏపీజేఏసీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. పెన్షనర్లకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఏపీజేఏసీ తరఫున చర్చలు, ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు.

పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూలి 70 ఏళ్లు పైబడిన పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పెన్షన్ మంజూరు చేయడం వల్ల రాష్ట్రంలోని వృద్ధాప్య పెన్షనర్లకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. వయస్సు పెరిగే కొద్దీ వైద్య ఖర్చులు, ఇతర జీవన వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో అదనపు క్వాంటమ్ వారికి ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో జీఓ నంబర్ 1 ద్వారా కల్పించిన ప్రయోజనాలను సైతం వెనక్కి తీసుకున్నారని వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ సమయంలో ఏపీజేఏసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపట్టడంతో ప్రభుత్వం చర్చలకు ముందుకు వచ్చిందన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో సెప్టెంబర్ 5న ఏపీజేఏసీ ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్న సమయంలోనే ప్రభుత్వం చర్చలకు పిలవడం, అనంతరం పెన్షనర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పెన్షనర్ల సమస్యలను అర్థం చేసుకుని, అదనపు క్వాంటమ్ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ఏపీజేఏసీ చైర్మన్ విద్యాసాగర్‌కు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. పెన్షనర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి పెన్షనర్ల సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారానికి కూడా ఏపీజేఏసీ నిరంతరం కృషి చేస్తుందని, ప్రభుత్వంతో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తామని విద్యాసాగర్, కె.ఎస్.ఎస్. ప్రసాద్, వెంకటేశ్వర్లు తెలిపారు.

సమావేశంలో కె.ఎస్.ఎస్. ప్రసాద్ (ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్), డి.వి. రమణ (ఏపీ నాన్-గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్), సి. హెచ్. మంజుల (ఏపీఎస్‌టీఎఫ్-257), ఎ. సాంబశివరావు (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్), డి. వెంకటేశ్వర్లు (రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, ఆంధ్రప్రదేశ్) తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పక్షపాతిగా చంద్రబాబు..

## సీఎం భరోసాతో మురిసిన ఉద్యోగ 'సాగరం'






- పే-రివిజన్ కమిషన్ నియమిస్తాం... 2 పెండింగ్ డీఏలను విడుదల చేస్తాం
- గత ప్రభుత్వం రద్దు చేసిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్దరణ
- ఈహెచ్ఎస్ స్ట్రీమ్ లైన్... 2022 ఏడాది సరెండర్ లీవుల విడుదల
- ఆర్థిక ఇబ్బందులున్నా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నాం: ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రభుత్వ నిర్ణయాలపై ఉద్యోగుల హర్షం.. ప్రభుత్వానికి సహకరిస్తామని వ్యాఖ్య

**అమరావతి, సెప్టెంబర్ 5:** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 12వ పే-రివిజన్ కమిషన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే పెండింగులో ఉన్న 4 డీఏల్లో 2 డీఏల విడుదలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. వీటితో పాటు మరికొన్ని ముఖ్యమైన పెండింగ్ అంశాలకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్ధికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్ర ఆదాయ-వ్యయాల లెక్కలను ఉద్యోగుల ముందు ఉంచారు. రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా.... ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలతతో ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మేరకు కొన్ని కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకరించారు. అలాగే 1-7-2024, 1-1-2025లకు చెందిన రెండు డీఏల విడుదలకు ఆమోదం తెలిపారు. ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. ఇక 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవులను వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాలో వేయడానికి అంగీకరించారు. ఇక పోలీసులకు 1 అడిషనల్ సరెండర్ లీవ్‌ను ఈ దసరాకు చెల్లించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇక గత ప్రభుత్వం రద్దు చేసిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి ఇచ్చేందుకు నిర్ణయించారు. దీంట్లో భాగంగా 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింప చేయనున్నారు. ఇక ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ చేస్తూ వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లింపులు జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల కోసం తీసుకున్న ఈ నిర్ణయాలతో ఏటా రూ.2,880 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు కానుంది.

**రూ.30 వేల కోట్లకు పైగా పెండింగ్ బకాయిలు చెల్లించాం :** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..." మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా... గత రెండేళ్ల కాలంలో ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు ఇస్తున్నాం.. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇస్తున్నాం. 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపచేశాం. ఉద్యోగులకు సంబంధించి ఉన్న పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ.30,849 కోట్లు క్లియర్ చేశాం. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వడ్డీలకు అప్పులు తెచ్చింది. ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై భారీగా ఉన్న వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించుకోగలిగాం. ప్రస్తుతం సరాసరి 9.1 శాతం వడ్డీని ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తోంది. ఈ భారాన్ని ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను నెమ్మదిగా గాడిన పెడుతున్నాం. గత పాలకులు ఉద్యోగులను దగ్గరకే రానీయలేదు. రివర్స్ పీఆర్సీ ఇచ్చారు... అలాంటి పరిస్థితులు ఉద్యోగులు మరిచిపోవద్దు. గత ప్రభుత్వం రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను కూడా పెండింగులో పెట్టింది. ఉద్యోగులను అవమానించేలా వాలంటరీలతో కరపత్రాలు పంపిణీ చేయించారు.. హోర్డింగులు పెట్టించారు... పేపర్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మధ్యవర్తులతోనే మాట్లాడే పరిస్థితి నాడు ఉండేది. సమస్యల పరిష్కారం కోసం నాటి సీఎం కాళ్లు పట్టుకోవాలని అప్పుడు మంత్రులుగా ఉన్న వారు కామెంట్లు చేశారు...



అవమానించారు. మంచికి చెడుకు ఉన్న వ్యత్యాసాన్ని ఉద్యోగులందరూ గుర్తించాలి. మేం ఉద్యోగులను గౌరవిస్తున్నాం... సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నాం. రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదని వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సానుకూలంగా ఉంటాం. ఆర్థిక వెసులుబాటు ఉంటే ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. 2014లో నాడు విభజన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం. విభజనకు వ్యతిరేకంగా పోరాడింది ఉద్యోగులే. వారిని గౌరవించాలని.. ఇబ్బందులు వస్తాయని తెలిసినా... 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చాం. ఉద్యోగులు వారి సమస్యల గురించి.. యూనియన్ల కోసం పని చేస్తారు. నేను రాష్ట్రం కోసం... ప్రజల కోసం ఆలోచించాలి. ఇందులో ఉద్యోగులూ భాగమే."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**గత పాలకుల నిర్వాకం వల్ల పెళ్లిళ్లను వాయిదా వేసుకున్నాం: ఉద్యోగులు:** ఉద్యోగుల పెండింగ్ సమస్యలను.. డిమాండ్లను నెరవెరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనపై సమావేశానికి హాజరైన ఉద్యోగ సంఘాల నేతల హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యల పట్ల సానుకూలత కనబరిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో పీఎఫ్ లోన్లను కూడా ఇవ్వకుండా వేధించడం వల్ల పెళ్లిళ్లను కూడా వాయిదా వేసుకున్న పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. రిటైర్మెంట్ ఉద్యోగులకు మేలు చేసేలా ఉన్న అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను గత ప్రభుత్వం రద్దు చేసింది. దాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్దరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సును పెంచినందుకూ కృతజ్ఞతలు తెలియచేశారు. రాష్ట్రానికున్న ఆర్థిక ఇబ్బందులను తాము అర్థం చేసుకున్నామని... రాష్ట్రాభివృద్ధికి, ప్రభుత్వానికి తమ వైపు నుంచి పూర్తి సహకారాన్ని అందిస్తామని ఉద్యోగులు వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌తో ఆర్థిక భరోసా



- ఏపీజేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్, డి.వి. రమణలకు పెన్షనర్ల సంఘం ఘన సన్మానం

**విజయవాడ,సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల పలు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ సాధించేందుకు కృషి చేసిన ఏపీజేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్, డి.వి. రమణలను పెన్షనర్ల సంఘం నాయకులు, పెన్షనర్లు ఘనంగా సన్మానించారు.

70 సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు 10 శాతం, 75 సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు 15 శాతం అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 2027 జనవరి నుంచి అమలు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల పెన్షనర్లు హర్షం వ్యక్తం చేశారు.

ఈ నిర్ణయం వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లకు ఎంతో ఆర్థిక భరోసాను కల్పిస్తుందని పెన్షనర్ల సంఘం నాయకులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో అదనపు పెన్షన్ వల్ల వృద్ధ పెన్షనర్లకు వైద్యం, నిత్యావసర ఖర్చులను భరించడంలో కొంతమేర ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తున్న ఏపీజేఏసీ నాయకులు ఎ. విద్యాసాగర్, డి.వి. రమణలకు ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఇదే విధంగా కృషి చేయాలని కోరారు.

విద్యాసాగర్ ను సన్మానించిన వారిలో పెన్షనర్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు జిల్లా కార్యవర్గ సభ్యులు జి నారాయణ రావు ,విష్ణు వర్ధన్ రావు ,కె.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఐఆర్ లేకుండా పీఆర్సీ కమిషనా?


# ఉద్యోగుల ఆశలు అడియాశలు

- గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్ జమాల్ రెడ్డి

**అమరావతి, సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రితో ఉద్యోగ సంఘాలు జరిపిన చర్చల్లో కొత్త పీఆర్సీ కమిషన్‌తో పాటు 30 శాతం మధ్యంతర భృతి, పెండింగ్ బకాయిలు, సరెండర్ సెలవుల చెల్లింపుపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తారని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆశించారని, అయితే వారి ఆశలు అడియాశలయ్యాయని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్ రెడ్డి అన్నారు. కేవలం డీఏల కోసం ముఖ్యమంత్రితో ఉద్యోగ సంఘాలు చర్చలు జరపడం గతంలో ఎన్నడూ లేని కొత్త సంప్రదాయమని ఆయన వ్యాఖ్యానించారు. ఇకనైనా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించిన తర్వాతే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని జమాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు, సరెండర్ సెలవుల నగదీకరణకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించి, నిర్ణీత కాలపరిమితిలో వాటిని చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఉద్యోగుల పోరాటం ఫలితంగానే ముఖ్యమంత్రితో చర్చలు

- రెండు డీఏలు, పీఆర్సీ కమిషన్, సరెండర్ లీవ్‌పై నిర్ణయాలు
- మధ్యంతర భృతిపై ప్రకటన లేకపోవడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి
- నేడు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ
- రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు




**అమరావతి, సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ఉద్యోగుల పోరాటం ఫలితంగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉద్యోగ సంఘాలతో హుటాహుటిన చర్చలు జరిపారని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు.

ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై పలు సానుకూల నిర్ణయాలు, హామీలు ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పన్నెండవ వేతన సవరణ సంఘం నియామకానికి అంగీకరించడం, రెండు కరువు భత్యాలను అక్టోబర్ 1 నుంచి చెల్లించేందుకు నిర్ణయించడం, సరెండర్ సెలవుల బకాయిలను చెల్లించేందుకు అంగీకరించడం, అదనపు క్వాంటం పింఛను పునరుద్ధరణకు నిర్ణయం తీసుకోవడం ఉద్యోగులకు, పెన్షనర్లకు కొంత ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు.

2024 జూలై 1, 2025 జనవరి 1 నుంచి అమలుకావాల్సిన రెండు కరువు భత్యాలను విడుదల చేసి, 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ సెలవుల బకాయిలను వచ్చే సంక్రాంతి నాటికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసేందుకు అంగీకరించిందన్నారు. పోలీసు సిబ్బందికి అదనంగా ఒక సరెండర్ సెలవును దసరా నాటికి చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

అదనపు క్వాంటం పింఛను 2027 జనవరి నుంచి పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు క్వాంటం పింఛను వర్తింపజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, వచ్చే నెల నుంచి ప్రతి నెలకు సంబంధించిన మొత్తాన్ని అదే నెలలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుకు జమ చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నిర్ణయాల అమలుకు ప్రతి ఏడాది సుమారు రూ.2,880 కోట్ల అదనపు వ్యయం అవుతుందని బొప్పరాజు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రావాల్సిన ఇంక్రిమెంట్లతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని కోరినట్లు తెలిపారు. ఈ అంశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆర్థిక శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు.

అయితే ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మధ్యంతర భృతి విషయంలో సమావేశంలో ఎలాంటి ప్రకటన చేయకపోవడం కొంత అసంతృప్తికి కారణమైందని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు తెలిపారు. ఉద్యోగులు ఇప్పటికే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మధ్యంతర భృతిపై కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ఉన్న మొత్తం 21 ఉద్యోగ సంఘాలను ముఖ్యమంత్రితో చర్చలకు ఆహ్వానించి ఉంటే బాగుండేదని వారు అభిప్రాయపడ్డారు. గతంలో జూలై 22న ఉద్యోగ సంఘాలతో చర్చించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తాజా నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏపీ జేఏసీ అమరావతి చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా నిర్వహించిన 'ఉద్యోగుల పోరాటం' ఫలితంగానే సాధ్యమయ్యాయని ఉద్యమ కమిటీ చైర్మన్ టి.వి. ఫణి పేర్రాజు తెలిపారు. అయితే బకాయిలపై స్పష్టత ఇవ్వకపోవడం, మధ్యంతర భృతిని ప్రకటించకపోవడంపై జిల్లాల నాయకత్వాల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోందని కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, మహిళా విభాగం చైర్‌పర్సన్ పి. లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి తెలిపారు.

ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నప్పటికీ, ఇప్పటికే ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ కొనసాగుతున్నందున శనివారం కూడా ఏపీ జేఏసీ అమరావతి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ఆదివారం భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం :** ఉద్యమ కార్యాచరణను కొనసాగించాలా, తదుపరి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే అంశంపై ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల నాయకులతో చర్చించిన అనంతరం గతంలో ఉద్యమ కార్యాచరణను రూపొందించినందున, మరోసారి రాష్ట్ర కార్యవర్గంతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు.

### విద్యా సాగర్ నాయకత్వానికి నీరాజనం..

# ఉప్పొంగిన ఉద్యోగ సాగరం



- **ఉద్యోగుల సమస్యలకు పరిష్కార బాట.. చంద్రబాబు నిర్ణయాలకు ఉద్యోగ లోకం జేజేలు**
- **ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ప్రభుత్వానికి ఏపీ జేఏసీ కృతజ్ఞతలు**

**గుంటూరు, సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న కీలక నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు, కన్వీనర్ కాలీద్ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు ఏపీ ఎన్జీవో హోంలో సమావేశమై ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన 11 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపిన అనంతరం ముఖ్యమంత్రి ప్రకటించిన నిర్ణయాలు ఉద్యోగులకు ఆర్థికంగా కొంత ఊరటనిచ్చే విధంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. పన్నెండవ వేతన సవరణ సంఘం నియామకానికి అంగీకరించడం, రెండు కరువు భత్యాలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించాలని నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 2024 జూలై 1, 2025 జనవరి 1 నుంచి అమలుకావాల్సిన కరువు భత్యాలను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ సెలవుల బకాయిలను వచ్చే సంక్రాంతి నాటికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసేందుకు అంగీకరించడం, పోలీసు సిబ్బందికి అదనంగా ఒక సరెండర్ సెలవును దసరా నాటికి చెల్లించేందుకు నిర్ణయించడం స్వాగతించదగిన చర్యలని తెలిపారు.

అదనపు క్వాంటం పింఛన్‌ను 2027 జనవరి నుంచి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు క్వాంటం పింఛన్ వర్తింపజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని క్రమబద్ధీకరించి, వచ్చే నెల నుంచి ప్రతి నెలకు సంబంధించిన మొత్తాన్ని అదే నెలలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుకు చెల్లించేలా చర్యలు తీసుకోవడం కూడా సంతోషకరమన్నారు.

స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్ల అంశాన్ని పరిష్కరించేందుకు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే అంశంపై ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా పరిష్కారం చూపేలా అధికారులను ఆదేశించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాల వల్ల ప్రతి ఏడాది సుమారు రూ.2,880 కోట్ల అదనపు వ్యయం అవుతుందని నాయకులు తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములని, వారికి సాధ్యమైనంత వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఉద్యోగ సంఘాల డిమాండ్లపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చొరవ చూపిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్థిక శాఖ సీనియర్ అధికారులు ఎస్.ఎస్. రావత్, పీయూష్ కుమార్, అల్లాడ గౌతమ్‌లకు కూడా ఏపీ జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవో జిల్లా కార్యదర్శి శ్యామ్ సుందర శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, నగర అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ తాజున్నిసా, జిల్లా నాయకులు నరసింహారావు, సయ్యద్ జానీబాషా, అనిల్ కుమార్, విజయ్ బాబు, మారిలతో పాటు జిల్లా, గుంటూరు నగర మహిళా కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు.

## ఐఆర్ ప్రకటించకుండా చర్చలు సఫలమైనట్లు ఎలా?

- **ఉద్యోగుల ఆశలకు రెండు డీఏలతోనే నీళ్లు చల్లారు**
- **వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్**

**అమరావతి, సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** మధ్యంతర భృతి ప్రకటించకుండా ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి నిర్వహించిన చర్చలు సఫలమైనట్లు ఎలా చెబుతారని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు మెరుగైన వేతన సవరణతో పాటు మధ్యంతర భృతి ప్రకటిస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 30 నెలలు కావస్తున్నా ఆ హామీలు అమలు కాలేదని వారు విమర్శించారు.

గత ప్రభుత్వం నియమించిన వేతన సవరణ సంఘం చైర్మన్‌ను తొలగించిన ప్రభుత్వం అనంతరం కాలయాపన చేస్తూ వచ్చిందని ఆరోపించారు. శనివారం ముఖ్యమంత్రితో జరిగిన చర్చల్లో మధ్యంతర భృతి ప్రకటిస్తారని ఉద్యోగులంతా ఆశగా ఎదురుచూశారని, అయితే కేవలం వేతన సవరణ సంఘం నియామకం, మధ్యంతర భృతిపై హామీలతోనే చర్చలను ముగించడం నిరాశకు గురిచేసిందన్నారు.

ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఐదు కరువు భత్యాల్లో రెండు కరువు భత్యాలను మాత్రమే ప్రకటించడం ద్వారా ఉద్యోగుల ఆశలకు నీళ్లు చల్లారని వారు మండిపడ్డారు. ప్రకటించిన రెండు కరువు భత్యాలకు సంబంధించిన బకాయిల చెల్లింపుపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై కూడా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. వేతన సవరణ సంఘం చైర్మన్‌ను నియమించడంతో పాటు నివేదిక సమర్పించేందుకు స్పష్టమైన కాలపరిమితి విధించాలని కోరారు. ప్రకటించిన రెండు కరువు భత్యాలకు సంబంధించిన బకాయిల చెల్లింపుపై వెంటనే స్పష్టత ఇవ్వాలని, మిగిలిన మూడు కరువు భత్యాలను కూడా తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా స్పష్టమైన కాలపరిమితితో కార్యాచరణ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

## 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

- **27 నెలల తర్వాత కొత్త పీఆర్సీ కమిషనర్ నియామకంతో ఒరిగేదేమిటి..?**
- **వైఎస్సార్‌సీపీ ఉద్యోగులు, పెన్షనర్ల రాష్ట్ర విభాగం అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్ రెడ్డి**




**తాడేపల్లి, సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగులు, పెన్షనర్లు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న సమయంలో కూటమి ప్రభుత్వం మరోసారి నిరాశకు గురిచేసిందని వైఎస్సార్‌సీపీ ఉద్యోగులు, పెన్షనర్ల రాష్ట్ర విభాగం అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో మంచి పీఆర్సీ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పటికే నియమించిన పీఆర్సీ కమిషనర్‌ను మార్చి 27 నెలల తర్వాత కొత్త కమిషనర్‌ను నియమించడం వల్ల ఉద్యోగులకు ఒరిగేదేమిటని ప్రశ్నించారు. పీఆర్సీ అమలుకు మరింత సమయం పట్టే పరిస్థితుల్లో ఉద్యోగులు, పెన్షనర్లు కోరుతున్న 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించి ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 27 శాతం మధ్యంతర భృతి మంజూరు చేసిందని గుర్తుచేశారు.

ప్రస్తుతం ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా కేవలం రెండు డీఏలను మాత్రమే అక్టోబర్ 1 నుంచి ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. మిగిలిన డీఏలను ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు వివిధ రూపాల్లో రూ.40 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని, వాటి చెల్లింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. సరెండర్ లీవ్ బకాయిలు, పెన్షనర్ల అదనపు క్వాంటమ్ పెన్షన్, ఈహెచ్ఎస్ బకాయిలను వెంటనే పరిష్కరించాలని అన్నారు.

ఎన్నికల సమయంలో జీపీఎస్‌ను రద్దు చేసి ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పెన్షన్ విధానం తీసుకొస్తామని ఇచ్చిన హామీని 27 నెలలు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. మూడు లక్షలకు పైగా ఉద్యోగులు స్పష్టమైన నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారని, ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములని చెప్పడం మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల సహనాన్ని పరీక్షించవద్దని, వారి సమస్యలను పరిష్కరించకపోతే ఎన్నికల సమయంలో ప్రజల తీర్పును ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ వినతులకు సీఎం సానుకూల స్పందన

- **ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు**
- **పీఆర్సీ కమిషన్ తక్షణ నియామకం.. మధ్యంతర భృతిపై కొంత సమయం పడుతుందని సీఎం స్పష్టీకరణ**



**అమరావతి, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయ రాజు తెలిపారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఏపీటీఎఫ్ తరఫున ఆయన పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలపై పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

సమావేశంలో పన్నెండవ వేతన సవరణ సంఘం నియామకానికి ముఖ్యమంత్రి అంగీకరించారని హృదయ రాజు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు కరువు భత్యాలను అక్టోబర్ నుంచి చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఒక దశ సరెండర్ సెలవుల నగదీకరణకు, పోలీసు సిబ్బందికి ఒక అదనపు సరెండర్ సెలవు నగదీకరణకు కూడా సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

పెన్షనర్లకు అదనపు క్వాంటం పింఛను విషయంలో 70 ఏళ్లు నిండిన వారికి 10 శాతం, 75 ఏళ్లు నిండిన వారికి 15 శాతం అదనపు పింఛను మంజూరుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి ఉద్యోగులు, ప్రభుత్వం చెల్లించే మొత్తాన్ని ప్రతి నెలా నేరుగా ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుకు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవడం వల్ల ఆరోగ్య పథకం వినియోగం మరింత సులభతరం అవుతుందని తెలిపారు.

**ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూల స్పందన:** ఉపాధ్యాయులకు సంబంధించిన పలు అంశాలపై ఏపీటీఎఫ్ తరఫున ముఖ్యమంత్రికి వినతిపత్రాలు సమర్పించినట్లు హృదయ రాజు తెలిపారు. రాష్ట్రపతి 2025 ఉత్తర్వుల నేపథ్యంలో స్థానిక కేడర్ వ్యవస్థీకరణ, ఉమ్మడి సేవా నియమావళి రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. అంతర్రాష్ట్ర బదిలీలను చేపట్టాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు.

ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలగకుండా ఉపాధ్యాయ అర్హత పరీక్షను సరళీకరించే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖలో కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరినట్లు తెలిపారు.

ఔట్‌సోర్సింగ్, కనీస కాలపరిమితి వేతన విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కనీస వేతనాలను పెంచడంతో పాటు పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే అంశాన్ని మంత్రుల బృందానికి అప్పగించినట్లు వెల్లడించారు.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం నుంచి పాత పెన్షన్ విధానానికి మార్పునకు సంబంధించి గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు అవసరమైన సూచనలను త్వరలో విడుదల చేస్తామని ప్రభుత్వం తెలిపిందన్నారు. 1998లో అర్హత సాధించిన ఇంకా నియామకాలు పొందని వారికి నియామకాలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు.

ఏపీటీఎఫ్ తరఫున సమర్పించిన వినతులను ముఖ్యమంత్రి వెంటనే మంత్రుల బృందం, ఆర్థిక శాఖ అధికారులకు అప్పగించి, తగిన పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేసినట్లు హృదయ రాజు తెలిపారు.

**మధ్యంతర భృతిపై త్వరలో నిర్ణయం:** పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించడంతో పాటు ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. దీనిపై పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే నియమిస్తానని, అయితే మధ్యంతర భృతి విషయంలో కొంత సమయం పడుతుందని ముఖ్యమంత్రి తెలిపినట్లు హృదయ రాజు వెల్లడించారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల ఏపీటీఎఫ్ తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జి. హృదయ రాజు, ఎస్. చిరంజీవి తెలిపారు.

## ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగ సంఘాలు ఎందుకు మాట్లాడలేదు?

- **ముఖ్యమంత్రితో ఉద్యోగ సంఘాల భేటీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మొండి చెయ్యి**
- **పారామెడికల్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ బాబు ఆవేదన**



**గుంటూరు, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు నిర్వహించిన సమావేశంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు ప్రాధాన్యత లభించలేదని పారామెడికల్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి. రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించేందుకు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అవసరం ఉంటుందని, అయితే వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విషయంలో మాత్రం ఉద్యోగ సంఘాలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పట్టించుకోనప్పుడు వారిని ఉద్యోగ సంఘాల్లో ఎందుకు చేర్చుకుంటున్నారని రమేష్ బాబు నిలదీశారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల శ్రమను వినియోగించుకుని ప్రయోజనం పొందుతూ, వారి సమస్యలను మాత్రం విస్మరించడం సమంజసం కాదన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఔట్సోర్సింగ్ ఉద్యోగుల తరఫున ప్రభుత్వంతో మాట్లాడాలని, లేదంటే తమ సంఘాల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగులను చేర్చుకోవద్దని స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులే ప్రభుత్వానికి సేవలు అందిస్తున్నారా? ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సేవలు అందించడం లేదా? అని ప్రశ్నించారు. తమ కుటుంబాలు, పిల్లల సంక్షేమం కోసం ఉద్యోగ సంఘాల నాయకులు పోరాడుతున్నట్లే, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాల గురించి కూడా ఆలోచించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల తరఫున పోరాడతామని హామీలు ఇస్తూ ఎంతకాలం మాయమాటలతో మోసం చేస్తారని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రితో శనివారం జరిగిన సమావేశంలో కనీసం ఒక్క అంశంపైనైనా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించిన ఉద్యోగ సంఘం ఉందా అని రమేష్ బాబు ప్రశ్నించారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఒకే క్యాడర్‌లో, ఒకే విధమైన విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదని నిలదీశారు. సంవత్సరాలుగా ప్రభుత్వ శాఖల్లో సేవలు అందిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తగిన గుర్తింపు, వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

పక్క రాష్ట్రాల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించే దిశగా చర్యలు తీసుకుంటున్న పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగిన వేతనం కూడా అందని పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమకు కనీసం సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.

ఇకనైనా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించాలని రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాలు కూడా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని వివిధ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘాలను కలుపుకుని త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

ఈ మేరకు పారామెడికల్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి. రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

## పీఆర్సీ కమిషన్ నియామకం, రెండు డీఏలకు అంగీకారం హర్షణీయం

- **ముఖ్యమంత్రి చంద్రబాబుకు జాతీయ ఉపాధ్యాయ పరిషత్ కృతజ్ఞతలు**

**అమరావతి, సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** వేతన సవరణ సంఘం నియామకానికి, రెండు కరువు భత్యాల చెల్లింపునకు అంగీకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ వేతన సవరణ సంఘాన్ని నియమించేందుకు, రెండు కరువు భత్యాలను చెల్లించేందుకు అంగీకరించడం హర్షణీయమని షరీఫ్ పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆర్థికంగా కొంత ఉపశమనం కలిగించే ఈ నిర్ణయాలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

పెన్షనర్లకు అదనపు క్వాంటం పింఛను మూడు శాతం పెంచేందుకు అంగీకరించడం కూడా సంతోషకరమైన పరిణామమని ఆయన అన్నారు. వేతన సవరణ సంఘాన్ని ఆలస్యం చేయకుండా త్వరలోనే నియమించి, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం పట్ల ఆశాభావం వ్యక్తం చేసిన షరీఫ్, మిగిలిన పెండింగ్ సమస్యలపై కూడా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ నిర్ణయాలపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం హర్షం



**అమరావతి, సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న కీలక నిర్ణయాలను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం స్వాగతించింది. ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సానుకూల పరిణామాలని సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పన్నెండవ వేతన సవరణ సంఘం నియామకం, 2024 జూలై 1, 2025 జనవరి 1 నుంచి అమలు కావాల్సిన కరువు భత్యాల విడుదల, మరో రెండు కరువు భత్యాలను అక్టోబర్ 1 నుంచి చెల్లించేందుకు నిర్ణయం తీసుకోవడం ఉద్యోగులకు ఆర్థికంగా కొంత ఊరటనిస్తుందని వారు తెలిపారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ సెలవుల బకాయిల చెల్లింపు, 2027 జనవరి నుంచి అదనపు పింఛను అమలు చేయాలని తీసుకున్న నిర్ణయం పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. డెబ్బై ఏళ్లు దాటిన పెన్షనర్లకు పది శాతం, డెబ్బై ఐదు ఏళ్లు దాటిన వారికి పదిహేను శాతం అదనపు పింఛను కల్పించే నిర్ణయాన్ని కూడా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం స్వాగతించింది. వృద్ధ పెన్షనర్లకు అదనపు ఆర్థిక భద్రత కల్పించే ఈ నిర్ణయం అభినందనీయమని సంఘం నాయకులు తెలిపారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం కృతజ్ఞతలు



**అమరావతి, సెప్టెంబర్ 5(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేయడం ఉద్యోగ వర్గాలకు భరోసా కల్పించిందని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశం సానుకూల వాతావరణంలో జరిగిందని రామకృష్ణ తెలిపారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సచివాలయ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, పీఆర్సీ చైర్మన్ నియామకం, నూతన ప్రభుత్వ భవనాల సముదాయంలో రాష్ట్ర సచివాలయానికి ప్రత్యేక టవర్ కేటాయింపు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఈహెచ్ఎస్‌ను క్రమబద్ధీకరించడం, సీపీఎస్‌కు ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం తదితర అంశాలను ప్రస్తావించినట్లు వెల్లడించారు.

ఉద్యోగులకు ఆర్థికంగా ఊరటనిచ్చేలా ఒకేసారి రెండు కరువు భత్యాలను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని రామకృష్ణ తెలిపారు. ఈ డీఏలు 2026 అక్టోబర్ 1 నుంచి వర్తిస్తాయని పేర్కొన్నారు. వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు పీఆర్సీ చైర్మన్‌ను వెంటనే నియమిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. సంక్రాంతి నాటికి ఒక సరెండర్ లీవ్ బిల్లును చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

అదేవిధంగా గతంలో ఉన్న అదనపు క్వాంటం పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని, ఐఆర్‌పై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం తెలిపిందన్నారు. పోలీసు సిబ్బందికి అక్టోబర్ నుంచి అదనపు సరెండర్ లీవ్ చెల్లింపునకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల అంశాన్ని త్వరితగతిన పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

ఈహెచ్ఎస్‌లో నగదు రహిత వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు ప్రభుత్వం, ఉద్యోగుల వాటాలను ఎప్పటికప్పుడు జమ చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఉద్యోగుల సమస్యలన్నింటినీ ఒకేసారి పరిష్కరించడం సాధ్యం కాకపోయినా, దశలవారీగా పరిష్కరిస్తామని, ఇందుకు ఉద్యోగులు సహకరించాలని ముఖ్యమంత్రి కోరినట్లు రామకృష్ణ తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో అనేక సవాళ్లు ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పలు తక్షణ నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రామకృష్ణ పేర్కొన్నారు.

ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు తెలిపారు.

## నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల దంపతులు



**చోడవరం(జర్నలిస్ట్ ఫైల్ ):**విశాఖ నగర వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ధర్మవరపు సత్తిబాబు కుమారుడి నిశ్చితార్థ వేడుక ఆదివారం అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు.
ధర్మవరపు సత్తిబాబు ఆహ్వానం మేరకు కడప జిల్లా బ్రహ్మంగారిమఠం శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారు, వారి సతీమణి శ్రీమతి ఉమాదేవి గారు వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.
ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారి దంపతులు ను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, ఆత్మీయ వాతావరణంలో ఘనంగా సాగింది.
ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, మాజీ కార్పొరేటర్ బ్రహ్మశ్రీ బోదులపాటి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు ధర్మవరపు చిన్నా, ధర్మవరపు సత్తిబాబు, వేమవరపు సత్తిబాబు, బంగారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత!

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పట్నంలోని 11KV లైన్ మరమ్మతులు మరియు లైనులకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించుటకు పనులు జరుగుతున్న క్రమంలో రైల్వే స్టేషన్ రోడ్డు, గౌతమ్ గ్రాండ్ హోటల్ రోడ్డు, మరియు గడ్డి పార్టీ అంజయ్య సత్రం రోడ్డు ప్రాంతంలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. అశోక్ కుమార్ కోరారు.

## ఎస్‌బీఐ భారీ విస్తరణ.. 12,000 కొత్త ఉద్యోగాలు, 250 కొత్త బ్రాంచ్‌లు




**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిరుద్యోగులకు, బ్యాంకింగ్ ఉద్యోగార్థులకు తీపి కబురు అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు 12,000 మంది కొత్త ఉద్యోగులను నియమించుకోవడంతో పాటు, దేశవ్యాప్తంగా 250 కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు.
ఈ నియామక ప్రక్రియలో భాగంగా క్లరికల్ (జూనియర్ అసోసియేట్), ఆఫీసర్ (ప్రొబేషనరీ ఆఫీసర్) కేడర్లలో దాదాపు 11,000 నుంచి 12,000 మందిని తీసుకోనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఉద్యోగుల పదవీ విరమణలు, బ్యాంకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ భర్తీ ప్రక్రియ ఉంటుందని ఆయన వివరించారు.
గతేడాది (2025–26) బ్యాంకు సుమారు 1,500 మంది ఐటీ స్పెషలిస్ట్ ఆఫీసర్లతో సహా మొత్తం 25,633 మందిని నియమించుకుంది. అయితే, ఈసారి ఐటీ రంగంలో అంత పెద్ద సంఖ్యలో నియామకాలు ఉండవని, జనరల్ బ్యాంకింగ్ సిబ్బందికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.
ఒకవైపు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తున్నప్పటికీ, భౌతిక బ్రాంచ్‌ల ప్రాధాన్యాన్ని కూడా బ్యాంకు గుర్తిస్తోందని ఛైర్మన్ అన్నారు. ఇందులో భాగంగా, కొత్తగా అభివృద్ధి చెందుతున్న నివాస, వాణిజ్య ప్రాంతాల్లో ఏటా నికరంగా 200 నుంచి 250 కొత్త శాఖలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.
సీఎన్‌బీసీ టీవీ18 కథనం ప్రకారం, కొన్ని పాత బ్రాంచ్‌లను హేతుబద్ధీకరించే ప్రక్రియ కూడా కొనసాగుతుందని తెలుస్తోంది. 2026 మార్చి నాటికి ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలకు పైగా ఉంది. తాజా నియామకాలతో బ్యాంకు తన సేవలను మరింత విస్తృతం చేయాలని భావిస్తోంది.

## భారత అధికారిక పటం ప్రకారమే జమ్మూ-కశ్మీర్, లడఖ్ చిత్రీకరణ : రణధీర్ జైస్వాల్



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించే ప్రపంచ పటాల్లో జమ్మూ-కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలను భారతదేశ అధికారిక పటం ప్రకారమే చిత్రీకరించాలని భారత్ స్పష్టం చేసింది. భారత సార్వభౌమ భూభాగాన్ని తప్పుగా లేదా తప్పుదోవ పట్టించే విధంగా చూపించే ఏ చిత్రీకరణనూ అంగీకరించబోమని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఆదివారం తెలిపారు. ప్రపంచ పటంలో ఖండాల భూభాగాలను మరింత కచ్చితంగా ప్రతిబింబించేలా మార్పులు చేయడం, ముఖ్యంగా ఆఫ్రికాకు సమాన ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా ఐరాస సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 4న ఒక తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. ఈ తీర్మానం ఏ ప్రత్యేక ప్రపంచ పటాన్ని ఆమోదించడంగానీ, ప్రామాణీకరించడంగానీ చేయదని, అంతర్జాతీయ సరిహద్దులు, వివాదాస్పద భూభాగాలు, ప్రాంతాల పేర్లకు సంబంధించిన రాజకీయ పటరచనపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన వివరించారు. జమ్మూ-కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలతో సహా భారత సార్వభౌమ భూభాగాన్ని అధికారిక భారత పటం ప్రకారమే చూపించాలని జైస్వాల్ పునరుద్ఘాటించారు. భారత సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతపై తమ వైఖరి స్పష్టమైనదని, స్థిరమైనదని, ఎలాంటి రాజీకి తావులేనిదని పేర్కొన్నారు.
టోగో ప్రతిపాదించిన ఈ తీర్మానానికి 164 దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. ఎస్టోనియా, జార్జియా, లిథువేనియా, మోల్డోవా, సెర్బియా, ఉక్రెయిన్ ఓటింగ్‌కు దూరంగా ఉండగా, అమెరికా తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసింది.

# పొగాకు రైతులకు భరోసా.. మార్కెట్‌లో మెరుగైన పరిస్థితులు

(మొదటి పేజీ తరువాయి)

అంచనా ఉత్పత్తి సుమారు 236 మిలియన్ కిలోలుగా ఉందన్నారు. ఇప్పటివరకు నమోదైన సగటు ధర కిలోకు రూ. 209.83గా ఉందని వెల్లడించారు. గత ఏడాది ఇదే 132 వేలం రోజుల నాటికి 140.27 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ కాగా, తుది సగటు ధర కిలోకు రూ. 248.86గా నమోదైందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది అధిక ఉత్పత్తి కారణంగా మార్కెట్‌లో సర్ప్లస్ ఏర్పడటంతో కొంత ఒత్తిడి నెలకొన్నప్పటికీ, ఇటీవల వేలాల్లో కొనుగోలుదారుల స్పందన, పోటీ గణనీయంగా మెరుగుపడుతున్నాయని తెలిపారు.

**తగ్గుతున్న 'నో-బిడ్'లు.. పెరుగుతున్న కొనుగోలుదారుల పోటీ :** ఇటీవల వేలం కేంద్రాల్లో 'నో-బిడ్' బేల్స్ శాతం గణనీయంగా తగ్గిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుతం రోజువారీగా సగటున 11-12 శాతం వరకు 'నో-బిడ్'లు నమోదవుతున్నాయని, కొన్ని వేలం ప్లాట్‌ఫారమ్‌లలో ఇది 1-2 శాతం కంటే కూడా తక్కువగా ఉందన్నారు. 'నో-బిడ్'లు తగ్గడం, కొనుగోలు కార్యకలాపాలు పెరగడం, కొనుగోలుదారుల మధ్య పోటీ మెరుగుపడటం మార్కెట్‌లో సానుకూల సంకేతాలని మంత్రి అన్నారు. ప్రస్తుతం వారానికి సుమారు 10 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ అవుతోందని తెలిపారు.



కొనుగోలుదారుల మధ్య పెరుగుతున్న పోటీ మెరుగైన ధరల సాధనకు దోహదపడుతోందన్నారు.

**కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ధరలు :** వివిధ వేలం ప్రాంతాల్లో కూడా మార్కెట్ పరిస్థితులు మెరుగుపడుతున్నాయని మంత్రి తెలిపారు. చీరాల ప్రాంతంలో అత్యధికంగా కిలోకు రూ. 329 వరకు ధర లభించిందన్నారు. జారూలో అత్యధిక బిడ్ రూ. 255, నాదీలాలో రూ. 252గా నమోదైందని వెల్లడించారు. డిమాండ్ ఉన్న గ్రేడ్లు, రకాల పొగాకుకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి స్పందన లభిస్తోందన్నారు. గత నెల రోజులుగా జారూ, నాదీలా ప్రాంతాల్లో కొనుగోలు వేగం, ధరల సాధన వేలం ప్రారంభ దశతో పోలిస్తే మెరుగుపడ్డాయని చెప్పారు.

**రైతుల ప్రయోజనాల కోసం నిరంతర పర్యవేక్షణ :** పొగాకు పంట మార్కెటింగ్ ప్రక్రియను టొబాకో బోర్డు ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు, తయారీదారులు, ఎగుమతిదారులు, వ్యాపార ప్రతినిధులతో సమన్వయం చేస్తూ కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామన్నారు. వేలాల్లో కొనుగోలుదారులు నిరంతరం పాల్గొనేలా చూడటం, మార్కెటబుల్ పొగాకును కొనుగోలు చేయడం, నివారించగల 'నో-బిడ్'లను తగ్గించడం, కొనుగోలు షెడ్యూల్‌ను క్రమబద్ధంగా కొనసాగించడం, పంటను త్వరితగతిన మార్కెట్ చేయడం వంటి అంశాలపై వ్యాపార వర్గాలతో చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపార వర్గాల ప్రతినిధులతో మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశామని, సీనియర్ అధికారులు వేలం ప్లాట్‌ఫారమ్‌లను సందర్శిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని మంత్రి వివరించారు.

**వచ్చే ఏడాది పంట పరిమాణం భారీగా తగ్గింపు :** ప్రస్తుత సీజన్‌లో అనుమతించబడిన పంట పరిమాణం, వాస్తవ ఉత్పత్తి మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడటంతో మార్కెట్‌లో అధిక పరిమాణంలో పొగాకు అందుబాటులోకి వచ్చిందని అచ్చెన్నాయుడు తెలిపారు. దీనివల్ల మార్కెట్‌పై ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని 2026-27 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌లో ఖీజం పొగాకు అనుమతించబడిన పంట పరిమాణాన్ని 142 మిలియన్ కిలోల నుంచి 81 మిలియన్ కిలోలకు తగ్గించినట్లు మంత్రి తెలిపారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని నియంత్రించడం, భవిష్యత్తులో అధిక మార్కెటబుల్ సర్ప్లస్ ఏర్పడకుండా చూడటం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమన్నారు. వచ్చే ఏడాది రైతులు అనుమతించబడిన పంట పరిమాణానికి మాత్రమే పరిమితమై సాగు చేసేలా టొబాకో బోర్డు ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయన మార్గదర్శకత్వంలో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, న్యాయమైన ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. వేలం ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది.
ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ




వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది.
సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.

**భవిష్యత్ లక్ష్యాలు ఇవే.. :** భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది.
ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

## విశాఖ జూకు కొత్త అతిథులు.. ఇక సందర్శకులకు డబుల్ ఆనందం!

**విశాఖ (జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల కొత్త కళను సంతరించుకుంది. సందర్శకులను మరింత ఆకట్టుకునేందుకు గుజరాత్ నుంచి అరుదైన, విదేశీ జంతువులు ఇక్కడికి చేరుకున్నాయి. జంతు మార్పిడి విధానంలో భాగంగా జీబ్రాలు, రెడ్ నెక్డ్ వాలీలతో పాటు ప్రత్యేకమైన కోతి జాతులను విశాఖకు తీసుకొచ్చారు. ఈ కొత్త జీవుల రాకతో జూలో సందడి వాతావరణం నెలకొంది.
జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రాధే కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి ఈ కొత్త జీవాలను విశాఖకు తీసుకొచ్చినట్లు జూ క్యూరేటర్ జి. మంగమ్మ తెలిపారు. వచ్చిన వాటిలో ఒక మగ, రెండు ఆడ జీబ్రాలు, ఒక మగ, రెండు ఆడ రెడ్ నెక్డ్ వాలీలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. వీటితో పాటు రెండు జతల కాటన్ టాప్ టామరిన్ కోతులు, ఒక మగ, రెండు ఆడ కామన్ మార్మోసెట్ కోతులు కూడా ఉన్నట్లు వివరించారు. ఈ మార్పిడిలో భాగంగా విశాఖ జూ నుంచి ఒక జత ఇండియన్ గౌర్ (అడవి దున్న), రెండు జతల స్టంప్ టైల్డ్ మకావ్ కోతులు, ఒక జత ఘరియల్ మొసళ్లను గుజరాత్‌కు పంపించారు. వెటర్నరీ అధికారుల పర్యవేక్షణలో ఈ జంతువులను సురక్షితంగా విశాఖకు చేర్చామని, ప్రస్తుతం వీటిని క్వారంటైన్‌లో ఉంచామని మంగమ్మ తెలిపారు. క్వారంటైన్ గడువు ముగిసిన తర్వాత సందర్శకుల వీక్షణ కోసం వాటికి కేటాయించిన ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లలోకి విడుదల చేస్తామని ఆమె వెల్లడించారు.




**ఇటీవల 128 కొత్త జీవాల జననం :** ఇదిలా ఉండగా, ఇటీవలి కాలంలో విశాఖ జూలో జంతు సంపద గణనీయంగా పెరిగింది. 12 రకాల జాతులకు చెందిన మొత్తం 128 కొత్త జీవాలు జన్మించినట్లు అటవీ శాఖ అధికారికంగా ప్రకటించింది. వీటిలో 40 స్టార్ తాబేళ్లు, 35 అడవి పందులు, 20 చుక్కల జింకలు, సాంబార్ జింకలు, హైనాలు, బైసన్‌లు వంటివి ఉన్నాయి. ఈ పరిణామంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా హర్షం వ్యక్తం చేశారు. ఈ కొత్త జంతువుల రాక, ఇటీవల జన్మించిన జీవాలతో విశాఖ జూ సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచనుంది.

## అదానీకి ఫెడరల్ కోర్టు షాక్



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** అనతికాలంలోనే కోటానుకోట్లకు పడగలెత్తిన అదానీ గ్రూపు సంస్థల అధినేత, బిజెపి పెద్దల సన్నిహితుడు గౌతమ్ అదానీకి అమెరికా ఫెడరల్ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సెక్యూరిటీలు, వైర్ ఫ్రాడ్ (వ్యక్తి లేదా సంస్థను మోసం చేసి వారి నుంచి డబ్బు, ఆస్తి, విలువైన సమాచారాన్ని దొంగిలించడానికి వివిధ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ మాధ్యమాలను ఉపయోగించడం) ఆరోపణలపై ఆయనతో పాటు సహచర నిందితులైన ఐదుగురిపై నమోదు చేసిన అభియోగాల ఉపసంహరణకు అమెరికా న్యాయ మంత్రిత్వ శాఖ చేసిన ప్రయత్నాలను ఫెడరల్ జడ్జి తిప్పికొట్టారు. గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, వినీత్ జైన్‌లపై నమోదైన సెక్యూరిటీలు, వైర్ మోసం అభియోగాలను గత నెల 10న న్యూయార్క్ ఈస్టర్న్ జిల్లా కోర్టు న్యాయమూర్తి నికొలస్ గరాఫస్ కొట్టివేసిన సంగతి తెలిసిందే. నిందితులపై వచ్చిన ఆరోపణలపై తమ అధికారులు దర్యాప్తు జరిపారని భారత్ తెలిపిందని, అయితే మంత్రిత్వ శాఖ ఉదహరించిన భారత న్యాయ ఉత్తర్వులు దీనికి విరుద్ధంగా ఉన్నాయని న్యాయమూర్తి తెలిపారు.
అదానీలు, వినీత్ జైన్‌పై గత నెలలో అభియోగాలను కొట్టివేసిన న్యాయస్థానం మిగిలిన ఐదుగురు నిందితులపై మోపిన అభియోగాల విషయంలో తీర్పును రిజర్వ్ చేసింది. అభియోగాలను ఎందుకు కొట్టివేయాలో సవివరంగా కారణాలతో తెలియజేయాలని న్యాయ శాఖను ఆదేశించింది. తాత్కాలిక డిప్యూటీ ఆటార్నీ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన ట్రెంట్‌కాటర్ గత నెల 11, 14 తేదీల్లో పంపిన లేఖల్లో ఎలాంటి కొత్త ఆధారాలు లేవని న్యాయమూర్తి తన తాజా రూలింగ్‌లో ఎత్తిచూపారు. అభియోగాలు నమోదైన సహ నిందితులలో పునరుద్పాదక ఇంధన కంపెనీ అజూర్ పవర్ మాజీ ఎగ్జిక్యూటివ్‌లు గుప్తా, రూపేష్ అగర్వాల్‌తో పాటు అజూర్‌లో ప్రధాన పెట్టుబడిదారుగా ఉన్న కెనడా పెన్షన్ నిధిలో మాజీ ఎగ్జిక్యూటివ్‌లు అయిన కబానెస్, సౌరభ్ అగర్వాల్, మల్హోత్రా ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు కేంద్ర బలగాలను రప్పించండి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక ఎన్నికల్లో భద్రత కోసం కేంద్ర బలగాల్ని మోహరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని వైసిపి కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి.. ఎన్నికల సంఘానికి ఆదివారం లేఖ రాశారు. అధికార యంత్రాంగ దుర్వినియోగం, అధికార పార్టీ వ్యక్తుల జోక్యం, బెదిరింపుల నేపథ్యంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర బలగాల భద్రత అవసరమని తెలిపారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలో జరిగిన జడ్‌పిటిసి ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన వ్యక్తులు పోలింగ్ ప్రక్రియలో జోక్యం చేసుకున్నారని, 2025 ఆగస్టు 7న నాగులదిన్నెవారిపల్లె గ్రామంలో వైసిపి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పార్టీ నేత వెలుపుల రామలింగారెడ్డిని లక్ష్యంగా చేసుకుని దాడి చేశారని, మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇలాంటి దారుణాలకే తెగబడ్డారని, తుని, పిడుగురాళ్ల, పాలకొండ మున్సిపాలిటీల్లో ఎన్నికల సమయంలో ఇలాంటి అరాచకాలే చేశారని లేఖలో పేర్కొన్నారు.

# ఇండియా కూటమికి రాహుల్ నాయకత్వమే!

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** కొద్ది రోజులుగా ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థికి సంబంధించి పలు ఊహాగానాలు వస్తున్న వేళ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసీ వేణుగోపాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి (×చీణ×ూ దీశ్రీశీమ) కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీనే నాయకత్వం వహిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం రోజు నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కేసీ వేణుగోపాల్ ఇలా వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో టీవీకే పార్టీ తమ నాయకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి సి. విజయ్ జోసెఫ్‌ను ఇండియా కూటమి తరఫున ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రతిపాదించిందన్న వార్తలను వేణుగోపాల్ ఖండించారు. విజయ్ గురించి ప్రస్తావిస్తూ విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ- ఆ కథనాల్లో నిజం లేదని, టీవీకే అలాంటి డిమాండ్ ఏం చేయలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎవరూ ఇలాంటి గందరగోళ పరిస్థితుల్ని సృష్టించవద్దని, ఇండియా కూటమి ముఖచిత్రంగా రాహుల్ గాంధీనే ఉంటారని వెల్లడించారు.

**రాహుల్ కార్యక్రమాలకు మంచి స్పందన వస్తోంది!** రైతులు, యువత, విద్యార్థులకు సంబంధించిన అనేక సమస్యలపై రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న రాజకీయ కార్యక్రమాలకు దేశవ్యాప్తంగా కూడా విశేష ఆదరణ లభిస్తోందని కేసీ వేణుగోపాల్ తెలిపారు. విద్యార్థులు,



రైతులు, యువత ఇలా ఏదైనా ఆయన నాయకత్వంలో జరుగుతున్న పోరాటాల గురించే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎక్కువగా చర్చ జరుగుతోందని ప్రశంసలు కురిపించారు. అయితే రాహుల్ గాంధీనే ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తారా అని విలేకరులు మరోసారి ప్రశ్నించగా- కచ్చితంగా అంటూ వేణుగోపాల్ క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం భారతీయులు అత్యధికంగా ఆదరించే ప్రముఖ నాయకుల్లో రాహుల్ గాంధీనే ముందు వరుసలో ఉంటారని, ఆయన తీసుకునే నిర్ణయాలను, చేసే పనులను ప్రజలంతా ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నారని చెప్పారు. కొన్ని రాష్ట్రాల్లో తమ భాగస్వామ్య పక్షాల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, ఇండియా కూటమి మాత్రం ఇప్పటికీ బలంగానే ఉందని చెప్పుకొచ్చారు.

**కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు- బీజేపీ సర్కార్ చీకటి యుగంవైపు నడిపిస్తోంది!** ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై కేసీ వేణుగోపాల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (దీజీూ) దేశాన్ని చీకటి యుగంవైపు తీసుకెళ్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర జరిగిన విద్యార్థుల శాంతియుత నిరసన, తర్వాత పోలీసుల అణచివేత చర్యల గురించి కూడా వేణుగోపాల్ ప్రస్తావించారు.
విద్యార్థులపై నిరసనల సమయంలో పోలీసు బలగాలు తీసుకున్న కఠిన చర్యల్ని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సమర్థించుకుంటూనే ఉందని మండిపడ్డారు. మరోవైపు ఉత్తరాఖండ్ హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభ నిర్వహించిన వేదికను, ఆయన ప్రసంగం అనంతరం శుద్ధి చేసిన ఉదంతాన్ని కూడా ఈ సందర్భంగా ఏఐసీసీ జనరల్ సెక్రటరీ గుర్తుచేశారు. భారతదేశం అంధకారం వైపు పయనిస్తోందని చెప్పడానికి ఇలాంటి ఘటనలే నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి దేశంలో ఒక బలమైన పోరాటం జరగడం అత్యవసరమని, తాము కూడా అదే కోరుకుంటున్నామని వ్యాఖ్యానించారు. కాగా, 2014 నుంచి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమే కేంద్రంలో అధికారంలో ఉంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే వరుసగా 3 సార్లు (2014, 2019, 2024) లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. 2029లో తదుపరి ఎన్నికలు జరగనున్నాయి.

# కాటేపల్లిలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మార్నింగ్ వాక్..

- ప్రజా సమస్యలపై ఆరా..ఉపాధ్యాయులను సన్మానించిన బీర్ల



**మోటకొండూరు, సెప్టెంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో శనివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతితో పాటు గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా.. గ్రామంలోని పాఠశాల ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి




**నల్గొండ, సెప్టెంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి మరియు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. పరంగి రవికుమార్ మాట్లాడుతూ, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన విద్యా సేవలు, తాత్విక ఆలోచనలు చిరస్మరణీయమని అన్నారు. ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశాలను బోధించే వ్యక్తి మాత్రమే కాకుండా, విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించే మార్గదర్శి అని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు రాధాకృష్ణన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ప్రొఫెసర్ అంతటి శ్రీనివాసులు మాట్లాడుతూ, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం, విద్యా తత్వం నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మానవీయ విలువలు, బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఉపాధ్యాయుడు మరింత నిబద్ధతతో తన బాధ్యతలను నిర్వర్తించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రామ్ అధికారులు నర్సింగ్ కోటయ్య, వెంకటరెడ్డి, డా. అదే మల్లేశం, శివరాణి, బొజ్జ అనిల్ కుమార్‌తో పాటు అధ్యాపకులు హబీబ్, జాజుల దినేష్, నాగరాజు కదిరే, హశ్రత్ బేగం, వంశీ, పావని, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకకు హాజరైన మంత్రి కోమటిరెడ్డి



**నల్గొండ, సెప్టెంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** నల్గొండ జిల్లా శ్రీజ-విశ్వ సాయి వివాహ వేడుకకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరు నల్లగొండకు చెందిన భాగ్యలత చిట్ ఫండ్స్ నిర్వాహకులు తేలుకుంట శ్రీనివాస్-రచన దంపతుల కుమార్తె శ్రీజ వివాహ వేడుకకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు శ్రీజ--విశ్వ సాయిని ఆశీర్వదించారు.నూతన దంపతులకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఆనందాలతో నిండాలని ఆకాంక్షించారు.

# మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు




**ఆత్మకూరు ఎస్, సెప్టెంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నకిరేకల్ పర్యటన సందర్భంగా పెండింగ్ లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తున్న మండల తాజా మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకొని ఆత్మకూరు ఎస్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ల ఫోరం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కేశబోయిన మల్లయ్య మాట్లాడుతూ అప్పులు చేసి గ్రామాన్ని అభివృద్ధి చేస్తే ప్రభుత్వం ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి పెండింగులో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయినా వారిలో సానబోయిన సుధాకర్, గుగులోత్ శ్రీను, మల్లారెడ్డి, లింగనాయక్, జగపతి, గంపల సతీష్ ఉన్నారు.

# అప్రమత్తతతో భక్తురాలి బంగారం భద్రం

- బస్సు సీటు కింద 15 గ్రాముల పుస్తెలతాడు గుర్తింపు..
- భక్తురాలికి అప్పగించిన ఎస్పీఎఫ్

**యాదగిరిగుట్ట, సెప్టెంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :**



యాదాద్రి దర్శనానికి వచ్చిన భక్తురాలు పోగొట్టుకున్న సుమారు 15 గ్రాముల బంగారు పుస్తెలతాడును ఎస్పీఎఫ్ సిబ్బంది అప్రమత్తతతో గుర్తించి సురక్షితంగా ఆమెకు అప్పగించారు. బస్సులో తొలుత ఆచూకీ లభించకపోయినా, మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేసి సీటు కింద ఉన్న నగను గుర్తించి భక్తురాలి చెంతకు చేర్చారు. శనివారం హనుమకొండకు చెందిన ఉప్పల రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆర్టీసీ బస్సులో కొండ కిందకు వెళ్తుండగా పుస్తెలతాడు పోయినట్లు గుర్తించారు. వెంటనే అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు భాస్కర్, విజయ్‌లకు సమాచారం ఇవ్వగా, వారు వెంటనే ఏఎస్ఐ కనకయ్యకు తెలియజేశారు.

దీంతో అప్రమత్తమైన ఎస్పీఎఫ్ సిబ్బంది బస్సులోని భక్తులను కిందకు దించి తనిఖీలు చేపట్టారు. తొలుత పుస్తెలతాడు లభించకపోవడంతో బస్సును మరోసారి క్షుణ్ణంగా పరిశీలించగా సీటు కింద బంగారు పుస్తెలతాడు కనిపించింది. అనంతరం సీఎస్ఓ కే.శేషగిరిరావు సమక్షంలో పుస్తెలతాడును రాజ్యలక్ష్మికి అప్పగించారు. పోయిన బంగారం తిరిగి దక్కడంతో భక్తురాలు, ఆమె కుటుంబ సభ్యులు ఎస్పీఎఫ్, హోంగార్డు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ఎస్పీఎఫ్ సిబ్బందిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజయ్య తదితరులు ఉన్నారు.

# విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- సమాజంలో పవిత్రమైన స్థానం ఉపాధ్యాయులదే
- విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గ దర్శకాలు
- 80 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు
- మెమెంటో శాలువాలతో ఘనంగా సత్కారాలు
- ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య





**యాదాద్రిభువనగిరి, సెప్టెంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యా యుల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. శని వారం రోజు కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఉపాధ్యాయుల దినోత్సవం , దిగంవత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేసి అనేక కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. సమాజంలో పవిత్రమైన స్థానం ఉపాధ్యాయులదని ఆయన కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి ఉత్తమ ఉపాధ్యా యులగా ఎంపిక చేయడం ఉపాధ్యాయులకు ఎంతో గౌరవ ప్రదంగా ఉంటుందన్నారు. గురువులను సన్మానించు కోవడం అంటే ఒకజన్మ దిన ధన్యమే అని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత మనం ఎక్కువ గౌరవించేది గురువులని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే వారిని తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని వారి సేవలను కొనియాడారు. గురువులు ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తులో వెలుగులు నింపారని తెలిపారు. ఉపాధ్యాయుల శ్రమ మట్టిలో మాణిక్యం లాంటిది అని , ఉపాధ్యాయులు పిల్లలను తనసొంత పిల్లలుగా చూసుకుంటు న్నారని తెలిపారు. తాను రైతు కుటుంబంలో పుట్టి ఒక ఉన్నత స్థాయికి ఎదిగా మంటే ఆగౌరవ ప్రదం గురువులకే దక్కుతుం దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారత దేశం తోనే కా కుండా ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా విద్యా రంగం పై పెద్దపీట వేసిందని అన్నారు. ఇంటి గ్రేటెడ్ స్కూల్స్ , ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సన్న బియ్యం తో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని ఇవ్వడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో అన్ని మౌలిక వసతులను కల్పించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఉపాధ్యాయు లు ఏ పని చేసిన ఒక చిత్త శుద్ధితో పని చేస్తారని ఉపాధ్యాయులను అభి నందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ముందుగా ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయలు సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయు ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మంచి నడవడిక , క్రమ శిక్షణ , నైతిక విలువలు నేర్పిస్తూ వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం లో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యా యులే మార్గదర్శకులని, వారి బోధన , ప్రోత్సాహం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపు తారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గించుకుంటూ విద్యార్థుల్లో సృజనాత్మ కత , నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి , ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య , ఆహారం అందేలా ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని అన్నారు. అనంతరం 80 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యా యులను పురస్కారాలు , మెమెంటో శాలువాతో సత్కరించారు. ఈ కార్య క్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ అవేజ్ చిస్తి , జడ్పీ సీఈఓ శోభారాణి , జిల్లా విద్యాధికారి బిక్షపతి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయినీ , ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం:ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

- బాలికల విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యం
- ప్రతి బాలికలోనూ భవిష్యత్ వైద్యురాలు, ఇంజినీరు, ఐఏఎస్ అధికారిణినిగా చూడాలనేది నా ఆకాంక్ష- బిఎల్ఆర్



**మిర్యాలగూడ సెప్టెంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి 138వ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి గారు పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, విలువలు, బాధ్యత, నైతికత వంటి అంశాలను నేర్పిస్తూ వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రత్యేకంగా బాలికల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బాధ్యత మరింత గొప్పదని శాసనసభ్యులు అన్నారు. ఒక బాలిక చదువుకుంటే ఒక కుటుంబం ఎదుగుతుంది.

ఒక బాలిక ఉన్నతంగా ఎదిగితే ఒక తరం మారుతుంది. విద్యావంతురాలైన ఒక మహిళ సమాజాన్ని మార్చగలదు. అని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో చదువుతున్న ప్రతి బాలికలోనూ తాను ఒక భవిష్యత్ వైద్యురాలిని, ఇంజినీరును, ఉపాధ్యాయు రాలిని, శాస్త్రవేత్తను, పోలీసు అధికారిణిని, ఐఏఎస్ అధికారిణిని, ప్రజాప్రతినిధిని చూడాలనుకుంటున్నానని బత్తుల లక్ష్మారెడ్డి గారు ఆకాంక్ష వ్యక్తం చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయుడికి ఆయన హృదయపూర్వక ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధర్మనాయక్, కొమ్ము శ్రీనివాస్, 35 వార్డ్ కౌన్సిలర్ దైద శ్యామ్ సుందర్, 34 వ వార్డు కౌన్సిలర్ దైద స్వప్న,పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు, యువత సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించింది.. యువతను మోసం చేస్తోంది

మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు





**మిర్యాలగూడ, సెప్టెంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు నాయకత్వంలో విద్యార్థులు, యువత సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విద్యార్థులు, యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులు, యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను కూడా ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు, కళాశాలలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు స్పష్టమైన ఉద్యోగ నియామక షెడ్యూల్‌ను ప్రకటించి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గాంధీ బొమ్మ, బస్టాండ్ మీదుగా రౌండ్ వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలపై సరైన నిర్ణయాలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందని నాయకులు విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి, జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువత సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకులు నల్లమోతు సిద్ధార్థ, ఎండి. యూసుఫ్, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి, ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, ఎండి. ఇలియాస్ ఖాన్, అంగోతు హతిరాం నాయక్, కుందూరు వీరకోటి రెడ్డి, ఎండి. మగ్దుంపాషా, ఎండి. మాజీద్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండి. షోయబ్, యర్రమళ్ళ దినేష్, PCK ప్రసాద్ తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, విద్యార్థి నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఎల్ఆర్‌ను విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకోండి..

- గాదరి కిషోర్‌పై కాంగ్రెస్ ధ్వజం
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన
- గాదరి కిషోర్ దిష్టిబొమ్మ దగ్ధం.. ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు పాలాభిషేకం
- తుంగపహాడ్‌లో బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం



**మిర్యాలగూడ సెప్టెంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ రైతు మహా ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై బీఆర్ఎస్ నేతలు చేసిన అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలను నిరసిస్తూ తుంగపహాడ్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై రాజకీయ విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత విమర్శలు, సత్యదూరమైన ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. వాస్తవాలను తెలుసుకోకుండా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై విమర్శలు చేయడం ద్వారా గాదరి కిషోర్ తన రాజకీయ స్థాయిని తానే దిగజార్చుకుంటున్నారని విమర్శించారు. ఎడమ కాలువకు వస్తున్న నీటి ప్రవాహంపై కనీస అవగాహన లేకుండా వేల క్యూసెక్కుల నీటి విషయంలో తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితుల్లో రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్వయంగా రైతులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి నీటి విడుదలకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. దేవులపల్లి రిజర్వాయర్ హెడ్ రెగ్యులేటర్, వజీరాబాద్, మేయర్ కిష్టాపురం మేజర్, కాల్వపల్లి మేజర్, తక్కెళ్లపాడు లిఫ్టుల వద్ద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రైతులు ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారని, అనంతరం నీటి ప్రవాహాన్ని 6 వేల క్యూసెక్కులకు పెంచినట్లు తెలిపారు. ఈ వాస్తవాలను పక్కనపెట్టి రైతులను, పార్టీ శ్రేణులను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేసే నైతిక హక్కు గాదరి కిషోర్‌కు లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన సొంత ఖర్చులతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే వ్యక్తిగతంగా అసత్య ఆరోపణలు చేస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. రాజకీయ విమర్శలు ప్రజా సమస్యలపై ఉండాలి.. వ్యక్తిగత విమర్శలకు దిగితే కాంగ్రెస్ శ్రేణులు తగిన రీతిలో స్పందిస్తాయి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తుంగపహాడ్ ఉమ్మడి గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ బెడుదూరు వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ నరసింహ, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుగంట్ల లింగయ్య యాదవ్, సీనియర్ నాయకులు సూది రెడ్డి శేఖర్ రెడ్డి, మచ్చ వెంకన్న, లావుడి బలరాం నాయక్, సజ్జల అనంత రెడ్డి, శాగం కరుణాకర్ రెడ్డి, చెన్నారెడ్డి, కాసాని శ్రీనివాస్, వంచ రవీందర్ రెడ్డి, వార్డు సభ్యులు రెమడాల శ్రీనివాస్, నందిపాటి ఆశీర్వాదం, సజ్జల శ్రీనివాస్ రెడ్డి, కొత్త రవి, ఉగ్గిడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ సీఓఓ గోపినాయుడిని పరామర్శించిన మంత్రి లోకేష్



**పాకాల (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్టీఆర్ ట్రస్ట్ సీఓఓ (చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్) అడుసుపల్లి గోపి నాయుడు, కుటుంబ సభ్యులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల గోపి నాయుడు తండ్రి ఆంజనేయులు నాయుడు స్వర్గస్థులయ్యారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా పాకాల మండలం అడుసుపల్లి గ్రామంలోని వారి నివాసానికి వెళ్లిన మంత్రి లోకేష్.. గోపినాయుడు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయుడు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంత్రి వెంట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేష్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, మురళీమోహన్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి ఉన్నారు.

## కేసీ పాములేటికి ఆర్ఎస్‌యూ ఘన నివాళి




**కడప (జర్నలిస్ట్ ఫైల్):** జమ్మలమడుగు పట్టణంలో సెప్టెంబరు 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ కేసీ పాములేటికి ఆర్ఎస్‌యూ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఆయన అకాల మరణంపై నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆదివారం కడపలోని ఆర్ఎస్‌యూ జిల్లా కార్యాలయంలో కేసీ పాములేటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమానికి ఆయన చేసిన సేవలను, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సాగించిన పోరాటాలను నాయకులు స్మరించుకున్నారు. పాములేటి అకాల మరణం ఆర్ఎస్‌యూకు, విద్యార్థి ఉద్యమానికి తీరని లోటని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొండం నాటి ప్రశాంత్ పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల కోసం ఆయన సాగించిన పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు నరేష్ నాయుడు, కడప జిల్లా అధ్యక్షుడు కొండయ్య, జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు జస్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చేబ్రోలు కొమ్మూరు కెనాల్ బ్రిడ్జి మరమ్మతులు పూర్తి చేస్తాం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** చేబ్రోలు కొమ్మూరు కెనాల్ బ్రిడ్జి మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేస్తామని రహదారులు భవనాలు శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ సి. విశ్వనాథరెడ్డి తెలిపారు. మరమ్మతులు పూర్తి చేసి ట్రాఫిక్ కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చేబ్రోలు కొమ్మూరు కెనాల్ గుంటూరు చీరాల రహదారి 15/ 8 కిలో మీటర్ల వద్ద బ్రిక్స్ తో కట్టిన పాత ఆర్చి బ్రిడ్జి దెబ్బతిన్న విషయం తెలిసిందేనన్నారు. పాత బ్రిడ్జి స్టీల్ గడ్డర్లు దెబ్బతినడంతో రెండు రోజుల క్రితం బ్రిడ్జి ఎడమ వైపు కొంత భాగం కూలిపోవడం జరిగిందన్నారు. బ్రిడ్జిపై రాకపోకలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసు సహకారంతో సమన్వయం చేసుకుంటూ మరమ్మత్తులు నిర్వహిస్తున్నామని చెప్పారు. బ్రిడ్జి పై పన్నెండు టన్నులకు మించి ఏ వాహనాలు అనుమతించడం లేదని అన్నారు. 16 మీటర్లు ఉండే కొత్త స్టీల్ గడ్డర్లకు హైదరాబాదులో ఆర్డర్ ఇచ్చామని, రెండు రోజుల్లో చేరతాయని వివరించారు. త్వరితగతిన పని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ బ్రిడ్జి 1865లో నిర్మాణం జరిగిందన్నారు. బాగా పాతది అయిపోవడంతో 2017లో బ్రిడ్జి రైట్ సైడ్ బలహీన పడటంతో మరమ్మత్తులు చేయించడం జరిగిందని తెలిపారు. 2020 సంవత్సరంలో రూ. 35. 35 కోట్ల వ్యయంతో ఎన్.డి.బి నిధులతో స్ట్రాటజిక్ ఇన్ఫ్రా బెంగుళూరు వారు పనులు ప్రారంభించారని పేర్కొన్నారు.

## 7 నుంచి 9 వరకు టీడీపీ ప్రజా వేదిక రద్దు

**అమరావతి, సెప్టెంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించే ప్రజా వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని సెప్టెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు రద్దు చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు తెలిపారు.

సెప్టెంబర్ 7, 8 తేదీల్లో టీడీపీ ఎమ్మెల్యేల శిక్షణ తరగతులు నిర్వహించనుండగా, సెప్టెంబర్ 9న గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎలాంటి ప్రజా వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించబోమని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అశోక్‌బాబు కోరారు.

# రాష్ట్రంలో సాంస్కృతిక కళలకు ప్రోత్సాహం : ఎమ్మెల్యే నసీర్

- కవులు, కళాకారులకు పెద్ద పీట
- కాసుల పురుషోత్తమ కవి జీవితం ఆదర్శం
- కాసుల పురుషోత్తమ కవి జయంతి ఉత్సవాల్లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** భారత దేశ సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షించేందుకు, తెలుగు భాషను వ్యాప్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృత నిశ్చయంతో పాటుపడతారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక విజ్ఞాన మందిరంలో కాసుల పురుషోత్తమ కవి జయంతి మహోత్సవాలకు ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో చేపట్టిన ఈ కార్యక్రమ మూడు రోజులుగా కొనసాగుతోంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాజుల అతిశయాన్ని రాజసంతో నిలదీసిన గొప్ప కవి కాసుల పురుషోత్తములని కొనియాడారు.

డాక్టర్ కాసుల కృష్ణంరాజు మిమిక్రీ ఆర్టిస్టుగానే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అత్యంత మక్కువ కలిగి ఉన్నారని తెలిపారు. ఎన్నో ప్రాంతాల నుంచి కళాకారులు ఇక్కడకు వచ్చినందుకు అభినందనలు చెప్పారు. బుర్రకథ, హరికథ, తప్పెటగుళ్ళు, కోలాటం వంటి అంతరించిపోతున్న జానపద కళారూపాలను ఆదరించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సాంప్రదాయ కళలైన కూచిపూడి, కర్ణాటక సంగీతం, తోలుబొమ్మలాట వంటి ప్రక్రియలను రక్షించడానికి ప్రభుత్వ సంగీత-నృత్య కళాశాలల ద్వారా శిక్షణ అందిస్తోందని చెప్పారు.

# నేరాలకు దూరంగా ఉంటూ చట్టబద్ధమైన జీవనం సాగించాలి

- రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు గుంటూరు జిల్లా పోలీసుల ప్రత్యేక కౌన్సెలింగ్




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆదివారం రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని ఇకపై ఎలాంటి నేరాలకు పాల్పడకుండా చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు. కుటుంబ సభ్యుల భవిష్యత్తు, సమాజంలో తమ గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని చెడు స్నేహాలు, అసాంఘిక కార్యకలాపాలు, నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని హితవు పలికారు. ప్రజల ప్రశాంతతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, నేరప్రవృత్తి ఉన్న వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. అదే సమయంలో నేరాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సమాజంలో ప్రశాంతంగా, చట్టబద్ధంగా జీవించే వారికి పోలీసుల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. నేరరహిత సమాజ నిర్మాణంతో పాటు ప్రజలకు ప్రశాంతమైన, సురక్షిత వాతావరణం కల్పించడమే గుంటూరు జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

# విద్యకు నోచుకోని హైస్కూల్ ప్లస్ విద్యాలయం

- నిర్మించి నాలుగేళ్లు గడిచినా పట్టించుకోని అధికారులు - AIYF ఏరియా కార్యదర్శి గుడిమే సురేష్ కుమార్





**బ్రహ్మం గారి మఠం(జర్నలిస్ట్ ఫైల్):** మండలంలోని స్థానిక్గూం పాఠశాలలో విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ విద్యాలయం నిర్మించి నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ వినియోగంలోకి రాకపోవడం దురదృష్టకరమని ాౌఖ్ఫ ఏరియా కార్యదర్శి గుడిమే సురేష్ కుమార్ అన్నారు.

2022 సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ ప్రారంభించి ఒక సంవత్సరం పాటు తరగతులు నిర్వహించి శాశ్వత భావనలకోసం రూ. 1.20 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. అయితే నిర్మాణం 80% పూర్తయినప్పటికీ మిగిలిన పనులు పూర్తిచేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించి, రెండవ విద్యాసంవత్సరం లో ఇంటర్ విద్యను నిలిపి వేయడంతో భవనం నిరుపయోగంగా మారి, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో నిర్మించిన భవనాన్ని ఇలా నిరుపయోగంగా వదిలేయడం వల్ల ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని ఆయన విమర్శించారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టి, రాబోయే విద్యాసంవత్సరం లో హైస్కూల్ ప్లస్ తరగతులను ప్రారంభించి విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిధులతో నిర్మించిన విద్యాలయం విద్యార్థులకు ఉపయోగపడకుండా శిథిలావస్థకు చేరడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గుడిమే సురేష్ కుమార్ అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హైస్కూల్ ప్లస్ విద్యాలయాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బ్రహ్మంగారిమఠంలో హై స్కూల్ ప్లస్ రాబోయే విద్యా సంవత్సరంలో తరగతుల ప్రారంభించడానికి మైదుకూరు శాసనసభ్యులు పూర్తి చొరవ చేసి విద్యార్థుల ఉన్నత మార్గాలకు అడుగులు వేసేలా హై స్కూల్ ప్లస్ ను మరలా ప్రారంభించాలని వారు కోరారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణమే చర్యలు తీసుకోకపోతే, విద్యార్థులు మరియు ప్రజలను సమీకరించిాౌఖ్ఫ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని, అవసరమైతే అధికారుల కార్యాలయాలను ముట్టడించేందుకు కూడా వెనుకాడబోమని గుడిమే సురేష్ కుమార్ హెచ్చరించారు.

# పి.జి.ఆర్.ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను ప్రతీ సోమవారం జిల్లా, మండల స్థాయిలో అన్ని కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. మీ కోసం వెబ్ సైట్ లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు నేరుగా సోమవారం నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు సమర్పించ వచ్చని లేదా మీ కోసం వెబ్ సైట్ Meekosam. ap. gov. in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పి.జి. ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని, ఆర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చని చెప్పారు.

# గణేష్ మండపాలకు ఆన్‌లైన్ సింగిల్ విండో ద్వారా సత్వర అనుమతులు

- మతసామరస్యం, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం
- గణేష్ ఉత్సవాలపై ప్రత్యేక చర్యలు : జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాబోయే వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని గుంటూరు జిల్లాలో గణేష్ మండపాల ఏర్పాటుకు భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సింగిల్ విండో విధానం ద్వారా సులభంగా, సత్వరంగా అనుమతులు మంజూరు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ తెలిపారు. పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన అనుమతులను ఒకే చోట పొందేలా స్త్రుఖఅవంస్త్రబ్ఖిజ. అప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం అందుబాటులో ఉందన్నారు.

నిర్వాహకులు ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత శాఖల నిబంధనలను పాటిస్తూ అనుమతులు పొందాలని ఎస్పీ సూచించారు. మండపాల ఏర్పాటులో నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు తమ పరిధిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి గణేష్ మండపాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, రహదారికి ఉన్న దూరం, ప్రజల రాకపోకలు, అత్యవసర వాహనాల రాకపోకలకు అవకాశం, విద్యుత్ వైరింగ్, అగ్నిమాపక భద్రత తదితర అంశాలను పరిశీలించిన అనంతరం నిబంధనల మేరకు అనుమతులు జారీ చేయాలని స్పష్టం చేశారు.

మండపాల వద్ద విద్యుత్ వైరింగ్, కనెక్షన్లు, జనరేటర్లు, లైటింగ్ ఏర్పాట్లలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలు, అగ్నిమాపక సిలిండర్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షితంగా బయటకు తరలించేలా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మండపాల కారణంగా సాధారణ ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, మార్కెట్ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ట్రాఫిక్ మార్గాలను ముందుగానే గుర్తించాలని సూచించారు.

వినాయక నిమజ్జనానికి సంబంధించి ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రదేశాలు, తేదీ, సమయం తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించి భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవలు, ప్రజల భద్రతకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

ముఖ్యమైన మండపాలు, రద్దీ ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రదేశాల్లో అవసరమైన మేరకు సీసీ కెమెరాలు, పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని, సున్నిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన బందోబస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

గణేష్ మండపాల అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా, నిబంధనల మేరకు వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిర్వాహకులకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.

గణేష్ ఉత్సవాల సందర్భంగా కుల, మత సామరస్యానికి ఎలాంటి భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఇతర మతాలు, వర్గాల మనోభావాలను గౌరవిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని, వివాదాస్పద వ్యాఖ్యలు, నినాదాలు, రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో పుకార్లు, తప్పుడు సమాచారం, వివాదాలకు దారితీసే పోస్టులను ప్రచారం చేయవద్దని ప్రజలకు సూచించారు.

ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు, ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజల భద్రత, మతసామరస్యం, శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ ప్రథమ ప్రాధాన్యమని ఎస్పీ స్పష్టం చేశారు.

## అమ్మవారి ఆశీస్సులతో గుంటూరు పశ్చిమ అభివృద్ధి పథంలో ముందుకు - ఎమ్మెల్యే గళ్లా మాధవి



- పోలేరమ్మ తల్లి కొలుపుల మహోత్సవమునకు హాజరైన ఎమ్మెల్యే గళ్లా మాధవి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 18వ డివిజన్ వడ్డెగూడెం, 19వ డివిజన్ నల్లచెరువు 4వ లైన్‌లో జరిగిన పోలేరమ్మ అమ్మవారి కొలుపుల మహోత్సవ కార్యక్రమాలకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్లా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే అమ్మవారి కొలుపులు ప్రజల విశ్వాసాలకు నిదర్శనమని, ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆకాంక్షించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**బ్రహ్మం గారి మఠం(జర్నలిస్ట్ ఫైల్):** స్వతంత్ర భారతదేశ రెండవ రాష్ట్రపతి ప్రముఖ తత్వవేత్త విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138 వ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 5వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించుకునే ఉపాధ్యాయ దినోత్సవాన్ని స్థానిక అమ్మవారి శాలయందు ఘనంగా నిర్వహించారు. అవొపా ( ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) మరియు ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అవోపా అధ్యక్ష కార్యదర్శులు ముచ్చర్ల శేషయ్య పత్తి సురేష్ ఆర్యవైశ్య సభ అధ్యక్ష కార్యదర్శులు అయ్యపు సురేష్ బాబు మరియు సుంకు సురేష్ లు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా జరిగిన సభలో వక్తలు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యారంగానికి అందించిన సేవలను ఆయన ఉన్నతమైన ఆలోచనలు విద్య పట్ల ఉన్న నిబద్ధతను కొనియాడారు అనంతరం ఆర్యవైశ్య ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఇరుసంఘాల అధ్యక్ష కార్యదర్శులు ఘనంగా దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదాల సురేంద్ర యువజన సంఘం అధ్యక్షులు యాదాల్ల వెంకటసుబ్బయ్య కోశాధికారి బింగి సూర్యనారాయణ ఉపాధ్యక్షుడు భింగి సురేష్ సుంకు చిన్న సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ పంచాయతీ సెక్రటరీ మృతి పట్ల ప్రముఖుల సంతాపం



**బ్రహ్మం గారి మఠం(జర్నలిస్ట్ ఫైల్):** మండల కేంద్రంలోని కొత్తూరు గ్రామానికి చెందిన తిప్పన సుబ్బరాయుడు (రిటైర్డ్ టీచర్) పెద్ద కుమారుడు మాజీ పంచాయతీ సెక్రటరీ తిప్పన జయరామ నాయుడు (68) శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతివార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**నివాళులర్పించిన ప్రముఖులు:**

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ వేంకటాద్రి స్వామి, బి.మఠం ఎంపీపీ సి. వీరనారాయణరెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జునరెడ్డి, మండల టీడీపీ నాయకులు ఎస్. ఆర్. శ్రీనివాసులరెడ్డి, ముడుమాల పోల్ రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ సాంబశివారెడ్డి, చెంచయ్యగారిపల్లె జయరాంరెడ్డి, మల్లేపల్లి సుధాకర్, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు శీలం నర్సింహులు, శివ యాదవ్ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే వైఎస్ఆర్సీపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మాజీ డైరెక్టర్ గొడ్లవీటి సుబ్రహ్మణ్యం, మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్, జిల్లా ఆర్టీఐ వింగ్ జనరల్ సెక్రెటరీ బి.ఎస్. నారాయణరెడ్డి, మన్యం శంకర్ రెడ్డి, రాళ్లపాటి మస్తాన్, జోగయ్య, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఏవో నరసయ్య, ఉపాధి హామీ మండల అధికారి హరికృష్ణ, పంచాయతీ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ఇన్చార్జి మాజీ ఎంపీడీవో మల్లికార్జున, దివంగత మఠాధిపతి కుమారులు వీరభద్రయ్య, వీరంబొట్లయ్యదత్తాత్రేయస్వామి తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఆదివారం జరిగిన అంతిమయాత్రలో స్థానికులు, బంధువులు, అభిమానులు, స్నేహితులు పెద్ద ఎత్తున పాల్గొని భూస్థాపిత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఆధ్యాత్మికతకు నిలయాలు ఆలయాలు : మంత్రి కందుల దుర్గేష్



❍ సూర్యారావుపాలెంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి దుర్గేష్

**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్):** ఆధ్యాత్మికతకు నిలయాలు ఆలయాలు అని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామం నందు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి నూతన ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ నిర్మాణం చేపట్టాలని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా అన్నారు.

## ఘనంగా కళ్యాణ భవనం ప్రారంభోత్సవం



**అమృతలూరు(జర్నలిస్ట్ ఫైల్):** అమృతలూరు మండలం యలవర్రు గ్రామంలో కీ.శే. కొత్తపల్లి అహరోను, రామయ్య, ముత్తయ్య, సిద్దయ్యల స్మారకార్థం నిర్మించిన కళ్యాణ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామస్తులు, భవన నిర్మాణానికి సహకరించిన దాత జక్రయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యక్రమానికి వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద బాబు, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టెనా తదితర ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు కళ్యాణ భవనాన్ని ప్రారంభించారు. వివాహాలు, శుభకార్యాలను గౌరవప్రదంగా, సౌకర్యవంతంగా, అందుబాటు ఖర్చుతో నిర్వహించుకునేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. గ్రామస్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన ఈ భవనం భవిష్యత్తులో అనేక కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. నిర్మాణానికి సహకరించిన దాత జక్రయ్యతో పాటు గ్రామస్తులను ప్రజాప్రతినిధులు అభినందించారు.

## మట్టి విగ్రహాలను పూజిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం



❍ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రజలకు పిలుపునిచ్చారు.

కొణిదే మోహన్ గోపి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన బ్రోచర్‌ను, మట్టి వినాయక విగ్రహ ప్రతిమను ఎమ్మెల్యే గల్లా మాధవి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని, వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలని కోరారు. సంప్రదాయాలను కాపాడుకుంటూనే ప్రకృతిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పరుచూరి సంజీవరావు, టీడీపీ తెలుగు యువత నాయకులు వంశీ, కిషోర్, ఆనంద్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం ప్రత్యేక దువా



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గుంటూరు నగరంలోని పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో ఆదివారం ప్రత్యేక దువా నిర్వహించారు. దువాలో పాల్గొన్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ దేవుని ప్రార్థనల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు కలగాలనే ఉద్దేశంతో అల్లాహ్ ను ప్రార్థించామని తెలిపారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు నమాజ్ లో పాల్గొని అల్లాహ్ ను ప్రార్థించారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలనే మంచి ఆలోచనతో ముస్లిం సోదరులు ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. దేవుని ప్రార్థించడం ఒక నమ్మకమని, వర్షాలు కురిసి అందరికీ మేలు చేయాలనే ఉద్దేశంతో చేపట్టారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్, ముస్లిం సోదరులు కలిసి ప్రత్యేక దువా నిర్వహించారు.

# ఉద్యోగుల ఐక్యతే ప్రభుత్వాన్ని స్పందించేలా చేసింది

❍ ఉద్యమ కార్యాచరణ తాత్కాలిక వాయిదా
❍ సీఎం హామీపై నమ్మకంతో నిర్ణయం
❍ ఐఆర్, బకాయిలపై త్వరిత నిర్ణయానికి డిమాండ్
❍ మిగిలిన 30 సమస్యలను కాలపరిమితిలో పరిష్కరించాలి
❍ ప్రభుత్వ నిర్ణయాల అమలుపై ఎప్పటికప్పుడు సమీక్ష
❍ ఉద్యోగుల ప్రయోజనాలకు భంగం కలిగితే ఉద్యమం కొనసాగింపు
❍ ఆరు నెలల్లో పీఆర్సీ నివేదిక ఇవ్వాలని డిమాండ్
❍ సెప్టెంబర్ 8న జిల్లాల్లో విజయోత్సవాలు
❍ ఉద్యోగుల ఐక్యతే ఉద్యమ విజయానికి ప్రధాన బలం
❍ ఉద్యోగులే విజయానికి పూర్తి హక్కుదారులు : ఏపీ జేఏసీ అమరావతి




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పలు నిర్ణయాలు ప్రకటించిన నేపథ్యంలో ఏపీ జేఏసీ అమరావతి చేపట్టిన ఉద్యమ కార్యాచరణను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీపై నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంఘం తెలిపింది. అయితే ఇంటెరిమ్ రిలీఫ్ (ఐఆర్), పెండింగ్ బకాయిల చెల్లింపుపై స్పష్టత రాకపోవడం పట్ల ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందని పేర్కొంది.

విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఏపీ జేఏసీ అమరావతి, రాష్ట్ర మహిళా విభాగం ఉమ్మడి రాష్ట్ర కార్యవర్గ సమావేశం చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఉద్యోగ సంఘాలతో సెప్టెంబర్ 5న జరిగిన సమావేశంలో ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయాలు, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పీఆర్సీ కమిషనర్ నియామకం, రెండు డీఏల విడుదల, పెన్షనర్లకు అదనపు పింఛను పునరుద్ధరణ, ఉద్యోగులు, పోలీసులకు సరెండర్ లీవుల మంజూరు, ఎంప్లాయిస్ హెల్త్ కార్డు వినియోగం వంటి నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఐఆర్ ప్రకటన, వేల కోట్ల రూపాయల బకాయిల చెల్లింపు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఇంక్రిమెంట్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై తుది నిర్ణయం వెలువడకపోవడంపై పలు జిల్లాల నాయకత్వాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. అయితే ఐఆర్ విషయంలో తనపై నమ్మకం ఉంచాలని, సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని గౌరవిస్తూ కొంత సమయం వేచి చూడాలని కార్యవర్గం నిర్ణయించింది. ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఐఆర్‌ను త్వరగా ప్రకటించి అమలు చేయాలని, బకాయిల చెల్లింపునకు రోడ్‌మ్యాప్ ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.

ఉద్యమానికి స్పందించి ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు ప్రకటించడంలో ఉద్యమం చేసిన ఉద్యోగులదే ప్రధాన పాత్ర అని ఏపీ జేఏసీ అమరావతి స్పష్టం చేసింది. ఎలాంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు తలొగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్న ఉద్యోగులు ఈ విజయానికి పూర్తి హక్కుదారులని పేర్కొంది. ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేసిన జిల్లా, డివిజన్, మండల, క్షేత్రస్థాయి నాయకత్వాలతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, మహిళా ఉద్యోగులు, ఉద్యమానికి మద్దతు తెలిపిన కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపింది.

పీఆర్సీ కమిషనర్ నియామకం ఇప్పటికే ఆలస్యమైనందున ఆరు నెలల్లో పీఆర్సీ నివేదిక సమర్పించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని సమావేశం తీర్మానించింది. గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ కమిటీ ద్వారా ఏపీ జేఏసీ అమరావతి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన మిగిలిన 30 ప్రధాన సమస్యలను త్వరితగతిన చర్చించి, ఒక్కో అంశానికి స్పష్టమైన పరిష్కారం చూపాలని కోరింది. ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయాలు పూర్తిగా అమలు అయ్యే వరకు, అలాగే మిగిలిన డిమాండ్లు పరిష్కారం అయ్యేవరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సమావేశం నిర్ణయించింది. భవిష్యత్‌లో ఉద్యోగుల హక్కులు, ప్రయోజనాలకు భంగం కలిగితే ఉద్యమ కార్యాచరణను తిరిగి కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగినంతకాలం నిర్మాణాత్మకంగా సహకరిస్తామని, అనవసర జాప్యం జరిగితే ప్రజాస్వామ్య ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపింది. ఉద్యమంలో సాధించిన సానుకూల ఫలితాల నేపథ్యంలో సెప్టెంబర్ 8న అన్ని జిల్లాల్లో విజయోత్సవాలు, సక్సెస్ మీట్లు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో అన్ని జిల్లాల పురుష, మహిళా విభాగాల చైర్మన్లు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్. శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ బత్తిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికే నా ఎంపీ ల్యాడ్స్ నిధులు : రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** తన ఎంపీ ల్యాడ్స్ నిధులను ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మాత్రమే వినియోగిస్తానని రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ తెలిపారు. ఆదివారం చంద్రమౌళినగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ మూడో రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భాష్యం రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైన ఆయనను నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులయ్యేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఉపాధ్యాయ లోకం, నోబుల్ టీచర్స్ అసోసియేషన్




సంపూర్ణ సహకారం అందించాలని భాష్యం రామకృష్ణ కోరారు.

కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న గుంటూరు-కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం దెబ్బతీసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రెండు డీఏలు ప్రకటించడం, ఉద్యోగుల సంక్షేమానికి పలు నిర్ణయాలు తీసుకోవడంతో పాటు పీఆర్సీ కమిటీ ఏర్పాటుకు అంగీకరించడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ పి. అశోక్ బాబు మాట్లాడుతూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రానున్న రోజుల్లో మరింత బలమైన సంఘంగా ఎదగాలని ఆకాంక్షించారు. నవంబరులో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించి రాష్ట్ర సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులకు వివరించడంతో పాటు సంఘ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

సమావేశంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రెడ్డి రమేష్, ఆర్థిక కార్యదర్శి జె. శ్రీనివాస్, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ పి. లలితబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జరిపిన చర్చల్లో రెండు డీఏలు ప్రకటించడం, త్వరలో పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, సంపాదిత సెలవుల నగదు చెల్లింపును సంక్రాంతికి చేపడతామని హామీ ఇవ్వడం, హెల్త్ కార్డులను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు అంగీకరించడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం పలు విద్యా, సంఘపరమైన తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు.ం

## వెలుగొండ ప్రాజెక్టును పరిశీలించిన సాదినేని యామిని శర్మ

**మార్కాపురం, సెప్టెంబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** వెలుగొండ ప్రాజెక్టును బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు, రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ బీజేపీ నాయకులతో కలిసి ఆదివారం సందర్శించారు. వెలుగొండ గొట్టిపడికే సమీపంలోని ఆనకట్టను పరిశీలించిన ఆమె, కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ కింద సుమారు రూ. 1,200 కోట్లతో నిర్మితమవుతున్న నీటి శుద్ధి కేంద్రం పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా యామిని శర్మ మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు సాధన కోసం 1978 నుంచి జనసంఘ్ నాయకులు, కార్యకర్తలు చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం బీజేపీ నాయకత్వంలో చేపట్టిన పాదయాత్రలు, వివిధ దశల్లో నిర్వహించిన ఉద్యమాలు ప్రాజెక్టు



సాధనలో కీలకంగా నిలిచాయని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టుకు రూ. 908 కోట్ల కేంద్ర నిధులతో సహకారం అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

1996 నుంచి చంద్రబాబు నాయుడు సంకల్పంతో వెలుగొండ ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయని, ఇటీవల మొదటి దశ పూర్తై ప్రజలకు తాగునీరు అందుబాటులోకి రావడం ఆనందకరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. మార్కాపురంలో నిర్వహించిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి యామిని శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 25 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న సేవా కార్యక్రమాల వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా బీజేపీ అధ్యక్షుడు పీవీ కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్, బెల్లంకొండ విజయలక్ష్మి, శిరసనగండ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించి ఉంటే బాగుండేది

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సెప్టెంబరు 5న ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశంలో 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నియామకంతో పాటు రెండు పెండింగ్ డీఏలను ప్రకటించడంపై మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ (ఎంఎస్‌పీటీఏ) హర్షం వ్యక్తం చేసింది.

అయితే పీఆర్సీ నియామకం ఇప్పటికే దాదాపు మూడేళ్లు ఆలస్యమైన నేపథ్యంలో ఉద్యోగులకు మధ్యంతర భృతి (ఐఆర్) కూడా ప్రకటించి ఉంటే మరింత ప్రయోజనం కలిగేదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ షఫీ పేర్కొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ముఖ్యమంత్రి నేరుగా చర్చించడం, 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, రెండు పెండింగ్ డీఏల విడుదలకు సంబంధించిన ప్రకటన చేయడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

పీఆర్సీ ప్రక్రియకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆర్థికంగా ఉపశమనం కల్పించేందుకు కనీసం 30 శాతం ఐఆర్‌ను వీలైనంత త్వరగా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# 7.8 శాతం జీడీపీ వృద్ధి - సంస్కరణల ఫలితంగా బలమైన భారత్



రచన: డా. కిలారు దిలీప్
బీజేపీ ఆంధ్రప్రదేశ్
రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్

భారత ఆర్థిక వ్యవస్థ మరోసారి ప్రపంచానికి తన సామర్థ్యాన్ని చాటుకుంది. 2026-2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వాస్తవ స్థూల దేశీయోత్పత్తి వృద్ధిని నమోదు చేయడం భారత ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత బలానికి నిదర్శనం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక అనిశ్చితులు, భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య వరవ్గైన సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ సాధించిన ఈ వృద్ధి ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.

వాస్తవ స్థూల విలువ జోడింపు 8.2 శాతం, తయారీ రంగం 9.2 శాతం, ప్రైవేటు పెట్టుబడులు 11.9 శాతం, ప్రైవేటు వినియోగం 7.1 శాతం, ఎగుమతులు 12 శాతం వృద్ధి సాధించడం భారత ఆర్థిక ప్రగతి విస్తృత స్థాయిలో కొనసాగుతోందని స్పష్టం చేస్తోంది. వినియోగం, పెట్టుబడులు, తయారీ, సేవలు, ఎగుమతులు పరస్పరం బలపరుచుకుంటూ దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయి.

అయితే ఈ వృద్ధిని కేవలం ఒక త్రైమాసిక గణాంకంగా చూడకూడదు. గత దశాబ్ద కాలంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాత్మక సంస్కరణలు, డిజిటల్ పరివర్తన, ఆర్థిక చేర్పు, మౌలిక వసతుల విస్తరణ వంటి చర్యలు నిర్మించిన పునాదులపై నేటి బలమైన వృద్ధి నిలబడింది.

**సంస్కరణలే ఆర్థిక వృద్ధికి బలమైన పునాదులు :** వస్తు సేవల పన్ను అమలు భారతదేశాన్ని ఒక సమగ్ర మార్కెట్‌గా అనుసంధానించడంలో కీలక పాత్ర పోషించింది. పన్నుల వ్యవస్థను సరళీకరించడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలను మరింత అధికారిక వ్యవస్థలోకి తీసుకురావడానికి ఇది దోహదపడింది.

అదే సమయంలో ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ, డిజిటల్ చెల్లింపులు భారత ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్నే మార్చేశాయి. చిన్న వ్యాపారి నుంచి సాధారణ వినియోగదారుడి వరకు కోట్లాది మంది డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములయ్యారు. నగదు ఆధారిత లావాదేవీలకు ప్రత్యామ్నాయంగా వేగవంతమైన, పారదర్శకమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ఏర్పడింది.

ప్రధానమంత్రి జనధన్ యోజన ద్వారా కోట్లాది మంది బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చారు. బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, ఆధార్ ఆధారిత గుర్తింపు, ప్రత్యక్ష ప్రయోజన బదిలీలు పరస్పరం అనుసంధానమై ఆర్థిక చేర్పును మరింత బలోపేతం చేశాయి.

ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా వీధి వ్యాపారులకు అధికారిక రుణ సదుపాయం కల్పించడం కూడా ఆర్థిక సాధికారతలో ముఖ్యమైన అడుగు. ముద్ర రుణాలు, సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలకు రుణ సౌకర్యాలు, ఉద్యమ్ నమోదు వంటి చర్యలు చిన్న వ్యాపారాలకు కొత్త అవకాశాలను విస్తరించాయి.

ఒక చిన్న వ్యాపారవేత్తకు రుణం అందడం అంటే కేవలం ఒక కుటుంబ ఆదాయం పెరగడం మాత్రమే కాదు. అది కొత్త వ్యాపారానికి, కొత్త ఉద్యోగానికి, కొత్త ఆర్థిక కార్యకలాపానికి దారితీసే అవకాశం. అందువల్ల చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహకారం దేశ వృద్ధిలో కీలకమైన అంశంగా మారింది.

**తయారీ, పెట్టుబడులు - కొత్త వృద్ధి చోదకాలు :** తయారీ రంగంలో 9.2 శాతం వృద్ధి, ప్రైవేటు పెట్టుబడుల్లో 11.9 శాతం పెరుగుదల భారతదేశంలో నూతన దిశలో పెట్టుబడి చక్రం బలపడుతున్న సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, విద్యుత్, లాజిస్టిక్స్, డిజిటల్ మౌలిక వసతులపై పెరుగుతున్న పెట్టుబడులు దేశ ఉత్పాదక సామర్థ్యాన్ని విస్తరిస్తున్నాయి. మౌలిక వసతులు మెరుగుపడితే రవాణా వ్యయాలు తగ్గుతాయి. సరఫరా గొలుసులు వేగవంతమవుతాయి. పరిశ్రమలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయి. దేశీయ తయారీకి ప్రోత్సాహం, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు, సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలకు మద్దతు వంటి చర్యలు భారతదేశాన్ని ప్రపంచ సరఫరా గొలుసుల్లో మరింత కీలక భాగస్వామిగా నిలబెట్టే దిశగా సాగుతున్నాయి. భారత్ ఇక కేవలం ప్రపంచానికి పెద్ద వినియోగ మార్కెట్ మాత్రమే కాదు. ప్రపంచ తయారీ, సరఫరా గొలుసుల్లో కీలక కేంద్రంగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

**బలహీన ఆర్థిక వ్యవస్థ అన్న విమర్శల నుంచి అగ్రస్థానానికి... :** ఒకప్పుడు భారతదేశాన్ని ప్రపంచంలోని బలహీన ఆర్థిక వ్యవస్థల సమూహంలో ఒకటిగా విమర్శించారు. నేడు ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో భారత్ స్థానం సంపాదించడం ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న నిర్మాణాత్మక మార్పుకు సూచిక.

ఈ వృద్ధి ఒక్కరోజులో సాధ్యమైనది కాదు. వస్తు సేవల పన్నుతో ఆర్థిక ఏకీకరణ, జనధన్ ద్వారా ఆర్థిక చేర్పు, డిజిటల్ చెల్లింపులతో ఆర్థిక పరివర్తన, ముద్ర మరియు స్వనిధి ద్వారా చిన్న వ్యాపారాలకు రుణ సదుపాయం, సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల సంస్కరణలు, భారీ మౌలిక వసతుల పెట్టుబడులు-ఇవన్నీ కలిసి భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త పునాదులను నిర్మించాయి.

అయితే ఆర్థిక వృద్ధిని కేవలం ప్రభుత్వ విధానాల విజయంగా మాత్రమే చూడటం కూడా సరైనది కాదు. కోట్లాది మంది పారిశ్రామికవేత్తలు, రైతులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, కార్మికులు, యువత, వినియోగదారులు కలిసి భారత ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్తున్నారు. సంస్కరణలు అవకాశాలను సృష్టిస్తే, వాటిని వృద్ధిగా మార్చేది ప్రజల భాగస్వామ్యమే.

**భారత్ ప్రధాని మోదీ పాలనా దక్షతపై ప్రపంచానికి ఓ సందేశం :** 7.8 శాతం స్థూల దేశీయోత్పత్తి వృద్ధి భారతదేశానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తోంది. దేశీయ వినియోగం, పెట్టుబడులు, తయారీ, సేవలు, ఎగుమతులు ఒకేసారి వృద్ధి చెందుతున్నప్పుడు ఆర్థిక వ్యవస్థలో విస్తృత స్థాయి చైతన్యం ఉన్నట్లు అర్థం.

అయితే ముందున్న సవాళ్లను విస్మరించకూడదు. అధిక నాణ్యత కలిగిన ఉపాధి సృష్టి, యువతకు నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ ఆదాయాల పెరుగుదల, చిన్న పరిశ్రమల పోటీతత్వం, ఎగుమతుల విస్తరణ, ద్రవ్యోల్బణ నియంత్రణ వంటి అంశాలపై నిరంతర దృష్టి అవసరం.

స్థూల దేశీయోత్పత్తి వృద్ధి ఎంత ముఖ్యమో, ఆ వృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు ఎంత విస్తృతంగా చేరుతున్నాయన్నది కూడా అంతే ముఖ్యం. వృద్ధి మరింత సమగ్రంగా, స్థిరంగా, ఉపాధి ఆధారితంగా మారినప్పుడే అది నిజమైన ఆర్థిక సాధికారతగా మారుతుంది.

**ప్రపంచ వృద్ధిలో భారత్ కీలక శక్తి :** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ భారతదేశం తన దేశీయ డిమాండ్, పెట్టుబడులు, తయారీ సామర్థ్యం, డిజిటల్ మౌలిక వసతులు, సేవల రంగం వంటి బలాలపై ఆధారపడి ముందుకు సాగుతోంది.

గతంలో భారత ఆర్థిక వ్యవస్థపై వ్యక్తమైన అనుమానాల నుంచి నేడు ప్రపంచ వృద్ధిలో కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకోవడం ఒక ముఖ్యమైన పరిణామం. ఈ ప్రయాణాన్ని మరింత వేగవంతం చేయాల్సిన బాధ్యత పాలకులతో పాటు పరిశ్రమలు, వ్యాపార రంగం, యువత, పౌర సమాజంపైనా ఉంది.

**7.8 శాతం ... భారత ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న ఆత్మవిశ్వాసానికి ఒక సూచిక :** సంస్కరణలు పునాదులను నిర్మించాయి. పెట్టుబడులు ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. డిజిటల్ పరివర్తన ఆర్థిక వ్యవస్థను విస్తరిస్తోంది. యువ భారతదేశం కొత్త అవకాశాలను సృష్టిస్తోంది.

బలమైన దేశీయ పునాదులతో ప్రపంచ ఆర్థిక వృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించే దిశగా భారత్ అడుగులు వేస్తోంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467